





Truth of News RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 53 | శుక్రవారం 18 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




### రాబర్ట్ వాద్రాపై
## ఈడీ చార్జిషీట్

- షికోపూర్ భూముల వ్యవహారంలో ఛార్జిషీట్ దాఖలు
- ఈ కేసులో పలుమార్లు విచారణకు పిలిచిన ఈడీ
- మనీలాండరింగ్ ఆరోపణల కేసులో ఛార్జిషీట్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 17**

కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) గురువారం చార్జిషీట్ నమోదు చేసింది. హర్యానాలోని షికోపూర్‌లో జరిగిన భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో

- మిగతా 2లో..

# 8వ సారి క్లీన్ సిటీగా ఇండోర్..

- ఢిల్లీలో విజేతలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రెండో స్వచ్ఛమైన నగరంగా సూరత్, మూడో స్థానంలో ముంబయి మహా నగరం
- స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీలోని ఐదు నగరాలకు చోటు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 17**

దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ సిటీ మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. తద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో ఇండోర్ వరుసగా ఎనిమిదో ఏడాది భారతదేశంలోని అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవార్డు అందుకుంది. ఇక, రెండో స్వచ్ఛమైన నగరంగా సూరత్, మూడో స్థానంలో ముంబయి మహా నగరం నిలిచింది.స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 అవార్డుల విజేతలను మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను అందజేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన



వేడుకల్లో 'స్వచ్ఛ' జాబితాలో నిలిచిన నగరాలకు అవార్డులను ప్రదానం చేశారు. కేంద్రం ప్రకటించిన ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీలోని ఐదు నగరాలకు

- మిగతా 2లో..



### బీహార్‌లో ఎన్నికల అధికారులు
## ఓటర్లను మోసం చేశారు

- ఇసి ఇప్పటికీ ఎన్నికల కమిషన్‌గా ఉందా లేక బిజెపికి ఓట్లు దొంగతనం చేసే శాఖగా మారిందా? : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 17**

బీహార్‌లో ఎన్నికల అధికారులు ఓటర్లను మోసం చేశారని గురువారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో.. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. బీహార్‌లో బిజెపి ఎలాగైనా గెలవాలని

- మిగతా 2లో..

### పర్యాటక పీపీపీ ప్రాజెక్టుల కోసం
## ప్రభుత్వ భూములు సేకరించండి

- ఎస్ఐపిబి సమావేశంలో సిఎం చంద్రబాబు
- రూ.39,473 కోట్ల పెట్టుబడులకు ఆమోదం



**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 17**

పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) విధానంలో చేపట్టే పర్యాటక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములను సేకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. 8వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలంలో దేవాలయంతో పాటు భారీ నీటి ప్రాజెక్టు ఉందని తెలిపారు. ఎక్కువ మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఆస్కారం ఉండేలా సమీకృత పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని చెప్పారు. కేవలం నిర్దేశిత ప్రాజెక్టుకు మాత్రమే పరిమితం కావొద్దని, అనుబంధ కార్యకలాపాలు వచ్చేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. సర్వీసు సెక్టార్ కూడా వచ్చేలా ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల చుట్టూ సంబంధిత ఎకో సిస్టం వచ్చేలా

- మిగతా 2లో..



## వచ్చే ఏడాదే..
# చిత్తూరుకు హంద్రీనీవా

- హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీటి విడుదలలో సిఎం ప్రకటన
- కేంద్రం ఇచ్చినప్పుడే 'అన్నదాతా సుఖీభవ'
- లోకేష్ 'సీమ డిక్లరేషన్'ను అమలు చేస్తాం
- ఆగస్టు 20లోగా మెగా డిఎస్‌సి నియామకాలు

**కర్నూలు - సూర్య వాస్తవం, జూలై 17**

హంద్రీనీవా నీటిని వచ్చే ఏడాది చిత్తూరుకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. గురువారం ఆయన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల ఎత్తిపోతల పథకం నుండి హంద్రీనీవా ప్రధాన కాలువకు సాగు నీటిని విడుదల చేశారు. తొలుత ఢిల్లీ నుండి విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి అక్కడి నుండి హెలికాప్టర్‌లో అల్లూరు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అనంతరం మల్యాల లిఫ్ట్ ఇరిగేషన్ వద్దకు వెళ్లి జలహారతి ఇచ్చి మూడు పంపుల ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ అడవిపల్లి రిజర్వాయర్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి చిత్తూరుకు నీటిని తరలిస్తామని చెప్పారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకపోతే చివరి ఆయకట్టు వరకూ నీళ్లు వెళ్లవని, అందుకే విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. సామర్థ్యాన్ని రెట్టింపు చేశామని, ఆరు లక్షల ఎకరాలకు, 33 లక్షల మంది రైతులకు నీరిచ్చే సౌకర్యం కల్పించామని వివరించారు. ఎనిమిది నెలల్లో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి కియా పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అన్నదాతా సుఖీభవ పథకంపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిదులు జమ చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ఆ డిక్లరేషన్‌లో భాగంగా లోకేష్ చేసిన హామీలన్నింటిని అమలు చేస్తామన్నారు. ఆగస్టు 20లోపు మెగా డిఎస్‌సి టీచర్ల నియామకాలు పూర్తి చేస్తామని తెలిపారు. శ్రీశైలం ఫ్లంజ్ పూల్‌ను రాష్ట్ర ప్రభుత్వమే రిపేరు చేస్తుందని ఢిల్లీ సమావేశంలో చెప్పినట్లు తెలిపారు. 2014-19 మధ్య టిడిపి హయాంలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. 2018లో హంద్రీనీవా వెడల్పునకు టెండర్లు పిలిచామని, ఆ తర్వాత వచ్చిన

- మిగతా 2లో..

### బియ్యం సరఫరాకు
## మిల్లర్లు సిద్ధం కావాలి

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 17**

రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యం మేరకు కేంద్రానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సరఫరా చేసేందుకు మిల్లర్లు సిద్ధం కావాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. విజయవాడ కానూరు సివిల్ సప్లరు భవన్‌లో రైస్ మిల్లర్ల ప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యాల ప్రకారం, కేంద్రానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ ను 10 శాతం బ్రోకెన్ (విరిగిన) బియ్యంతో సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు సిద్ధం కావాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. . ఈ సమావేశంలో



మంత్రి మనోహర్ మాట్లాడుతూ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు

- మిగతా 2లో..

### బనకచర్లపై బాబుకు
## అంత ప్రేమెందుకు?

- పిసిసి చీఫ్ షర్మిల

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 17**



అందరూ వద్దంటున్న పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై సిఎం చంద్రబాబుకు అంత ప్రేమ ఎందుకో అర్థం కావట్లేదని పిసిసి చీఫ్ వై.ఎస్ షర్మిల అన్నారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ ప్రాజెక్టుతో లక్షల కోట్ల రూపాయల ఖర్చు తప్ప ప్రయోజనం లేదని ఇంజినీర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. బనకచర్ల లింక్

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## రాబర్ట్ వాద్రాపై
# ఈడీ చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

రాబర్ట్‌వాద్రా, ఇతరుల పేరును చార్జిషీట్‌లో చేర్చినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద వాద్రా మరియు మరికొందరిపై స్థానిక కోర్టులో చార్జిషీటు దాఖలు చేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. క్రిమినల్ కేసులో వాద్రాపై దర్యాప్తు సంస్థ ఫిర్యాదు దాఖలు చేయడం ఇదే మొదటిసారి. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్‌లో వరుసగా మూడు రోజుల పాటు ఈడి వాద్రాను విచారించింది.

ఈ దర్యాప్తు హర్యానాలోని గురుగ్రామ్ జిల్లా మనేసర్-షికోపూర్ (ప్రస్తుతం సెక్టార్ 83)లో జరిగిన భూ ఒప్పందానికి సంబంధించినది. గతంలో వాద్రా డైరెక్టర్‌గా ఉన్న స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రై.లి కంపెనీ ఫిబ్రవరి 2008లో ఈ ఒప్పందాన్ని నిర్వహించింది. ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుండి షికోపూర్‌లో 3.5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్ల ధరకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో హర్యానాలో భూపేంద్ర సింగ్ హుడా అధికారంలో ఉన్నారు. నాలుగేళ్ల తర్వాత, 2012 సెప్టెంబర్‌లో ఆ కంపెనీ భూమినీ డిఎల్‌ఎఫ్ సంస్థకు రూ.58 కోట్లకు విక్రయించింది. 2012 అక్టోబర్‌లో హర్యానా ల్యాండ్ కన్సాలిడేషన్ అండ్ ల్యాండ్ రికార్డ్స్-కమ్-ఇన్‌స్పెక్టర్-జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులైన ఐఎఎస్ అధికారి అశోక్ ఖేమ్కా .. ఈ ఒప్పందం రాష్ట్ర ఏకీకరణ చట్టం, సంబంధిత కొన్ని నిబంధనలను ఉల్లంఘించిందంటూ ఈ భూ ఒప్పందాన్ని రద్దు చేశారు. దీంతో ఈ ఒప్పందం వివాదాస్పదమైంది. తనపై కేసును రాబర్ట్ వాద్రా తిరస్కరిస్తున్నారు. ఈ కేసును రాజకీయ కక్షగా అభివర్ణించారు. రాజస్తాన్ బికనీర్ భూఒప్పందం, యుకెకి చెందిన ఆయుధాల విక్రేత సంజరు భండారీకి సంబంధించిన కేసుల్లో కూడా ఈడి వాద్రాను విచారిస్తోంది.

# 8వ సారి క్లీన్ సిటీగా ఇండోర్..

(మొదటిపేజీ తరువాయి)

చోటు దక్కింది. విశాఖపట్నం జాతీయస్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డు దక్కించుకుంది. రాజమండ్రికి రాష్ట్రస్థాయిలో మినిస్టీరియల్ అవార్డు లభించింది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, తిరుపతి, గుంటూరు ఎంపికయ్యాయి.

## బీహార్‌లో ఎన్నికల అధికారులు
# ఓటర్లను మోసం చేశారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నిస్తుంది. దీనికితగ్గట్టుగా బిజెపి ఇసిని అడ్డంపెట్టుకుని ఓటర్ల జాబితాను తారుమారు చేస్తుంది. ప్రభుత్వాధికారులు ఓటర్లకు తెలియకుండానే ఓటరు ఫారాలను నింపి సంతకం చేస్తున్నారని ఓ జర్నలిస్టు పోస్టు చేసిన వీడియోను రాహుల్ షేర్ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఇప్పటికీ నిష్పాక్షికంగానే వ్యవహరిస్తుందా? లేక ఓట్లను దొంగతనం చేసే శాఖగా మారిపోయిందా అని ఆయన ప్రశ్నించారు.

కాగా, 'బీహార్‌లో ఎస్‌ఐఆర్ పేరుతో ఓట్లను దొంగిలిస్తూ ఎన్నికల కమిషన్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయింది. ఎన్నికల అధికారుల ఉద్యోగం.. దొంగతనం చేయడం. దానికి వారు పెట్టుకున్న పేరు 'ఎస్‌ఐఆర్'. వాళ్లు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని బయట పెట్టినవారిపై ఎఫ్‌ఐఆర్ నమోదవుతుంది. ఇసి ఇప్పటికీ ఎన్నికల కమిషన్‌గానే ఉందా? లేదా పూర్తిగా బిజెపి కోసం ఓట్లు దొంగిలించే శాఖగా మారిందా? అని ఆయన ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు. ఇటీవల జూలై 10న సుప్రీంకోర్టు ఎస్‌ఆర్‌ఐని కొనసాగించడానికి ఇసికి అనుమతినిచ్చింది. కానీ అదే సమయంలో ఆధార్, రేషన్‌కార్డు, ఎలక్టోరల్ ఫొటో గుర్తింపు కార్డులను ఓటర్లు గుర్తింపును నిరూపించడానికి ఆమోదయోగ్యమైన పత్రాలుగా అనుమతించడాన్ని పరిగణించాలని వారికి సలహా ఇచ్చింది. న్యాయమూర్తులు సుధాన్షు ధులియా, జారు మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## వచ్చే ఏడాదే..
# చిత్తూరుకు హంద్రినీవా

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. నదుల అనుసంధానం తన జీవిత ఆశయమన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరువు అనే మాట రాదని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 120 టిఎంసిల నీళ్లు ఇచ్చామని తెలిపారు. వర్షాకాలం కంటే ముందే జలాశయాల్లో 50 శాతం నీళ్లు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాయలసీమను కొందరు ఓట్ల రాజకీయాలకు వాడుకున్నారని విమర్శించారు. రాయలసీమను రాష్ట్రానికి మణిహారంగా తయారు చేస్తామన్నారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీలో దేశానికి కావాల్సిన డ్రోన్లను తయారు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌తో సమానంగా అమరావతిని తయారు చేసి అందరికీ గర్వకారణంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, బిసి జనార్ధన్ రెడ్డి, ఎన్‌ఎండి ఫరూక్, నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాండ్ర శివానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక పీపీపీ ప్రాజెక్టుల కోసం
# ప్రభుత్వ భూములు సేకరించండి

(మొదటిపేజీ తరువాయి)

చూడాలని చెప్పారు. ఏకో సిస్టం ద్వారా ఆయా ప్రాజెక్టులతో పాటు స్థానికులు, అనుబంధ సంస్థలకూ లబ్ధి కలుగుతుందని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు సమీపంలో రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు వంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆ ప్రాంతంలో ఎకనామిక్ యాక్టివిటీ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఎంతమందికి ఉద్యోగాలను కల్పించామో వివరాలు తెలిసేలా ఎంప్లాయిమెంట్ పోర్టల్ రూపొందించాలని ఆదేశించారు. ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించిన రూ.39,473కోట్ల పెట్టుబడులకు ఈ సమావేశంలో ఆమోదించారు. మొత్తం 22 ప్రాజెక్టుల ద్వారా 30,899 మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేశారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నారా లోకేష్, కె అచ్చెన్నాయుడు, టిజి భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తదితరులు హాజరయ్యారు.

# కార్పొరేట్ల కోసం.. మైనార్టీల జీవితాలతో చెలగాటం

- అస్సాంలో బుల్డోజర్ ఇన్ జస్టిస్
- కార్పొరేట్ల కోసం.. పేదలను నిరాశ్రయులను చేస్తున్న ప్రభుత్వం
- కరెంటు కోసం.. పర్యావరణ హననం
- సామాజిక అసమానతలకు దారితీస్తున్న అస్సాం ప్రభుత్వ చర్యలు
- రెండువేల ఇండ్ల కూల్చివేతను ఎలా సమర్థించుకుంటారు?
- ప్రభుత్వ భూమి పేరుతో పేదల ముస్లింల జీవితాలు బలి

కార్పొరేట్ల కోసం అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం పేద ముస్లింల జీవితాలను పణంగా పెట్టింది. అదానీ థర్మల్ ప్లాంట్ కోసం ఇటీవల సుమారు రెండు వేల ఇండ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేసింది. దీంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పుడు వారంతా బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఉన్న చార్ ప్రాంతంలో బంధువుల వద్ద తాత్కాలిక ఆశ్రయం పొందుతున్నారు. వరదలతో కోతకు గురయ్యే ఈ ప్రాంతంలో బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తమ ఇండ్లను కోల్పోయిన తర్వాత నిరాశ్రయులైన పేద ముస్లింలు తమ సామాన్లను పడవల ద్వారా తీసుకెళ్తున్న దృశ్యాలు చూసిన వారికి కన్నీళ్లు తెప్పించాయి.

**థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో..**

అస్సాంలోని ధుబ్రీ జిల్లా బిలాసీపారాలో అదానీ గ్రూప్, అస్సాం పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీడీసీఎల్) 3400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను సంయుక్తంగా నిర్మించాలని నిర్ణయించాయి. దీంతో చారువాబఖ్రా జంగల్ బ్లాక్, చిరకుటా పార్ట్-1, పార్ట్-2, సంతోష్‌పూర్ గ్రామాల్లో 3,500 బీగాల భూమిని ఖాళీ చేయాలని జులై 6న ప్రభుత్వం అక్కడ నివసిస్తున్న రెండు వేల మియా ముస్లింల కుటుంబాలకు నోటీసులు జారీచేసింది. దీన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయినా ప్రభుత్వం దాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అస్సాం ల్యాండ్ అండ్ రెవెన్యూ రెగ్యులేషన్ పేరుతో జులై 8న మూడువేల మంది పోలీసుల పహారాలో, వందకు పైగా బుల్డోజర్లతో రెండువేల ఇండ్లను కూల్చివేశారు. తమ ఇండ్లను కాపాడుకోవడానికి అధికార యంత్రాంగంతో జరిగిన ఘర్షణలో అనేక మంది పేదలు గాయపడ్డారు. ఈ చర్యలు వేలాది పేద మైనార్టీ కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీశాయి. అక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే.. పర్యావరణంపైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. ఈ చర్యలు చూస్తుంటే అస్సాం ప్రభుత్వం సామాన్య ప్రజలను పక్కనపెట్టి.. కార్పోరేట్లకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నదో అర్థమవుతున్నది.

**ఆశ్రయం, జీవనోపాధిపై ప్రభావం**

ఇది బీజేపీ కమ్యూనల్ ఎజెండా అని, ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకునే ఈ కూల్చివేతలు చేపట్టారని ఎమ్మెల్యే అఖిల్ గోగోయ్ ఇప్పటికే ఆరోపించారు. ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తూ.. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నదని సీపీఎం నాయకుడు సుప్రకాశ్ తాలుక్దార్ విమర్శించారు. కాగా, నిరాశ్రయులైన కుటుంబాలకు బోయ్జర్ ఆల్గా గ్రామంలో పునరావాసం కల్పిస్తామని అక్కడి ప్రభుత్వం హామీ ఇచ్చింది. రూ. 50వేల పరిహారాన్ని సైతం ప్రకటించింది. అయితే బోయ్జర్ ఆల్గా గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు లేవని, ప్రభుత్వం ఇచ్చే రూ. 50 వేల పరిహారం తమ జీవనోపాధి పునరుద్ధరణకు ఎటు సరిపోదని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో తమ ఇండ్లనుక ల్పోయిన బాధితులు.. ఇప్పుడు ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. ఇల్లు అనేది పేద కుటుంబాలకు కేవలం ఆశ్రయం మాత్రమే కాదు.. అది వారి ఆర్థిక స్థిరత్వం, సామాజిక గుర్తింపు, భద్రతకు పునాది. తగిన ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్య సదుపాయాలు లేని ప్రాంతంలో వారికి ఇండ్లు కేటాయించినా.. అది వారి జీవన ప్రమాణాలను మరింత దిగజార్చవచ్చు.

**పర్యావరణంపైనా ఎఫెక్ట్**

అదానీ గ్రూప్ భారతదేశంలో అతిపెద్ద పునరుత్పాదక ఇంధన సంస్థల్లో ఒకటి. గుజరాత్‌లోని ఖవ్డా వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్ ను ఇది నిర్మిస్తున్నది. ధుబ్రా లోని థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ వారి ఫాసిల్ ఇంధన ఆధారిత కార్యకలాపాల్లో భాగమని తెలుస్తున్నది. అయితే థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. గతంలో ఉడుపీలో అదానీ గ్రూప్.. తమ కోల్-బేస్డ్ పవర్ ప్లాంట్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించినట్లు స్పష్టమైంది. ఈ ఉడుపి ప్లాంట్ కోల్ డస్ట్, ఫ్లై యాష్, వేస్ట్ వాటర్ ద్వారా స్థానిక పొలాలు, గ్రామాలను కాలుష్యకోరల్లోకి నెట్టిందని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిర్ధారించింది. దీనికి గాను 2022లో ఎన్జీటీ ఉడుపీ ప్లాంట్‌పై రూ. 52 కోట్ల జరిమానా సైతం విధించింది. ధుబ్రీలో ప్రతిపాదించిన థర్మల్ ప్లాంట్ తో కూడా పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ ప్రాంతంలోని బ్రహ్మపుత్ర నది తీరంలోని చార్ ప్రాంతాలు పర్యావరణపరంగా సున్నితమైనవి, దీంతో ఇక్కడ థర్మల్ ప్లాంట్ నిర్మాణం స్థానిక జీవవైవిధ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.



ఈ ప్లాంట్ కోసం జరిపే భూ సేకరణ రైతుల జీవనోపాధిని సైతం దెబ్బతీ యొచ్చు.

– ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

## బియ్యం సరఫరాకు
# మిల్లర్లు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వనిబంధనల ప్రకారం సేకరించడం ద్వారా పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 5 రాష్ట్రాల నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు హర్యానా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 10 శాతం బ్రోకెన్ రైస్‌ను సేకరించేందుకు లక్ష్యాలు ఇచ్చారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రం నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ ను 10 శాతం బ్రోకెన్ రైస్ తో కేంద్రానికి సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు వారి సంసిద్ధతను స్పష్టమైన ప్రతిపాదనల ద్వారా తెలియజేయాలని ఆయన సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోటీపడి బియ్యం అందించడంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రైస్ మిల్లర్లకు పిలుపునిచ్చారు. సంబంధిత రైస్ మిల్లర్లు కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి, సరఫరా చేయాల్సిన బియ్యంలో బ్రోకెన్ శాతం 10 శాతం మించకుండా చూసుకోవాలన్నారు.

నిబంధనల మేరకు రైస్ మిల్లులు అవసరమైన టెస్టింగ్, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి, ఇచ్చిన గడువులోగా సరఫరా చేయాలని ఆయన సూచించారు. నాణ్యమైన బియ్యాన్ని కేంద్రానికి సమయానికి అందించడం వల్ల రాష్ట్రానికి మంచి పేరు వస్తుందని, 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పేరు నిలబెట్టేలా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన అన్నారు. సరఫరా ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, సంబంధిత అధికారులు మరియు మిల్లర్లు సమన్వయంతో ముందడుగు వేయాలని పౌర సరఫరాల శాఖ సూచించింది. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్ ఐఏఎస్, సివిల్ సప్లై ఎండీ మానవీర్ జిలానీ ఐఏఎస్, సివిల్ సప్లై కార్పొరేషన్ ఉన్నతాధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బనకచర్లపై బాబుకు
# అంత ప్రేమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదన పోలవసరం అసలుప్రాజెక్టుకు ఎసరు పెడుతుందని ప్రాజెక్టు అథారిటీ చెబుతున్నా, చంద్రబాబు తలకెక్కడం లేదన్నారు. 2014లో వైఎస్‌ఆర్ ప్రారంభించిన జలయజ్ఞంలో దాదాపు 39 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పదేళ్లలో ప్రభుత్వాలు తట్టెడు మట్టి తియ్యలేదని పేర్కొన్నారు.

సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చిస్తే ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయి 50 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు, కోటి మందికి తాగునీరు అందుతాయని తెలిసినా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరమన్నారు.

## కదిరిలో 9వ రోజు
# సుపరిపాలనలో తొలి అడుగు



**కదిరి – సూర్య వాస్తవం, జూలై 17**

రాష్ట్రవ్యాప్తంగా కూటమిప్రభుత్వ పాలనలో భాగంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పురస్కరించుకొని కదిరి మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డు లో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు ఇంటింటికి మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని దిగ్విజయంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ భాను, ఆధ్వర్యంలో 8వ వార్డు ఇంచార్జ్ విశ్వనాథ్ నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విధంగా కార్యక్రమాల కరపత్రాన్ని ఇంటింటికి పంచిపెట్టారు, అనంతరం వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారం కోరుతూ విజ్ఞప్తి చేస్తున్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తూ సమస్యలను సత్వర పరిష్కారం కొరకు కృషి చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి సల్మాన్ ఖాన్, టిడిపి నాయకులు ప్రవీణ్, గూని వాండ్ల రాజు , నరేంద్ర, డేవిడ్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు

# ఏపీలో వారం రోజులు భారీ వర్షాలు

**అమరావతి – సూర్య వాస్తవం, జూలై 17:**

ఆంధ్రప్రదేశ్ రైతులకు గుడ్ న్యూస్. గురు, శుక్రవారాల్లో ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. అంతేకాదు రాష్ట్రంకు వారం రోజుల పాటు వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. ఆగ్నేయ ఉత్తరప్రదేశ్ వద్ద కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో కోస్తా జిల్లాల్లో ఐదు రోజుల పాటు బలమైన గాలులు ఉండే అవకాశాలు ఉన్నాయి. అల్లూరి, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో నేడు, రేపు భారీ వర్షాలు కురవనున్నాయి. గడిచిన 24 గంటల్లో విజయనగరం జిల్లాలో 12 సెంమీ అత్యధిక వర్షపాతం నమోదు అయింది. వర్షాలు లేక అల్లాడుతున్న రైతాంగానికి ఇది చల్లని కబురు అనే చెప్పాలి.

# సంపాదకీయం

## ప్రతి ఒక్కరిపై 11 లక్షల అప్పు

ప్రపంచంలో ఎంత అప్పు ఉందో తెలుసా..? అది ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ పంచితే దాదాపు రూ.11 లక్షల ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం, ప్రపంచం మొత్తం అప్పు 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. ప్రపంచ జనాభా 8.2 బిలియన్లు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా అత్యధిక రుణాన్ని కలిగి ఉంది. కాగా, చైనా, జపాన్, యూరోపియన్ దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్ 7వ స్థానంలో ఉంది. దీని మీద 3 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉంది. ఇది మొత్తం ఉఆఖ కంటే తక్కువగా ఉండవచ్చు. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌కి ఈ రుణం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచం, దేశాల రుణాలకు సంబంధించి ఈ నివేదికలో ఎలాంటి గణాంకాలు ఉన్నాయో చూద్దాం.

భారతదేశం గత దశాబ్దకాలంలో అనేక ఆర్థిక సంస్కరణలు, సామాజిక పథకాలు, రాజకీయ మార్పులను చవిచూసింది. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశ ఆర్థికవృద్ధి, ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఎన్నో వాగ్దానాలు చేసింది. అయితే, ఇటీవలి ఆర్థిక నివేదికలు, సామాజిక వాస్తవాలు సామాన్య పౌరుడి జీవితంలో పెరిగిన అప్పుల భారాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల విడుదల చేసిన ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్-2025 ప్రకారం, దేశంలోని ప్రతి పౌరుడిపై సగటున రూ. 4.8 లక్షల అప్పు ఉంది. ఇది గత రెండేళ్లలో రూ. 90,000 మేర పెరిగింది. ఈ గణాంకాలు సామాన్యుడి జీవన పరిస్థితులు ఎంత దిగజారాయో చాటుతున్నాయి.ఆర్‌బిఐ నివేదిక ప్రకారం, 2023 మార్చిలో ఒక్కో పౌరుడిపై అప్పు రూ. 3.9 లక్షలుగా ఉండగా, 2025 మార్చి నాటికి ఇది రూ. 4.8 లక్షలకు చేరింది. ఈ రూ. 90,000 పెరుగుదల సామాన్యుడి ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. దేశ జిడిపిలో అప్పుల వాటా 41.9 శాతంగా ఉంది. ఇందులో గృహ రుణాలు 29 శాతం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, మొబైల్ ఇఎంఐలు 54.9 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మరో ఆందోళనకర అంశం ఏమిటంటే, లోన్-టు-వాల్యూ (ఎల్‌టివి) రేషియో 70 శాతానికి పైగా ఉండటం. ఇది రుణాల రికవరీని కష్టతరం చేస్తుంది. అంతేకాక, 25 శాతం రిటైల్ రుణాలు సురక్షితం కానివిగా గుర్తించారు. ఇది ఆర్థిక వ్యవస్థలో అస్థిరతను సూచిస్తుంది.ఫోర్బ్ నివేదిక ప్రకారం, దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 2.16 లక్షలు మాత్రమే. అంటే, సామాన్యుడి అప్పు అతని ఆదాయం కంటే రెండింతలకు పైగా ఉంది. ఈ అసమతుల్యత సామాన్య పౌరుడు తన రోజువారీ జీవన అవసరాల కోసం అప్పులపై ఆధారపడుతున్నాడని స్పష్టం చేస్తుంది. ఆర్‌బిఐ గణాంకాలు చెప్పేది ఏమిటంటే 55% అప్పులు, ఆస్తుల సృష్టికి కాకుండా, కేవలం జీవన ఖర్చుల కోసమే తీసుకోబడుతున్నాయి. క్రెడిట్ కార్డుల వాడకం, వ్యక్తిగత రుణాలు, ఇఎంఐలు ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది, నిత్యావసర వస్తువుల ధరలు గత 11 ఏళ్లలో దాదాపు 300 శాతం పెరిగాయి. ఆహారం, ఇంధనం, గృహ ఖర్చులు, విద్య, వైద్యం వంటి అంశాలు సామాన్యుడికి భారంగా మారాయి.రెండవది, ద్రవ్యోల్బణం పెరిగినా, వేతనాలు దానికి అనుగుణంగా పెరగలేదు. చాలీచాలని జీతాలతో కుటుంబ ఖర్చులను భరించలేక, ప్రజలు అప్పులపై ఆధారపడుతున్నారు. మూడవది, నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు తగ్గాయి. యువతలో నిరుద్యోగం రేటు గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది, ఇది ఆర్థిక అస్థిరతకు దారితీస్తోంది.

ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలు- ఉదాహరణకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై), ఆయుష్మాన్ భారత్- పేదలకు సహాయం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. అయితే, ఈ పథకాలు అమలులో లోపాలు, అవగాహన లేమి లేదా అర్హత సమస్యల వల్ల సామాన్యుడికి పూర్తి ప్రయోజనం చేకూరడం లేదు. పిఎంఎవై కింద గృహ రుణాలపై సబ్సిడీలు అందుతున్నప్పటికీ అర్హత నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియలు సంక్లిష్టంగా ఉండటం వల్ల చాలా మంది ఈ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వంటి విమర్శకులు, మోడీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విఫలమైందని ఆరోపిస్తున్నారు. అచ్చేదిన్ నినాదంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం, వాస్తవానికి ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిందని వాదిస్తున్నారు. ఒక వైపు సామాన్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, ప్రభుత్వానికి సన్నిహిత వ్యాపారవేత్తలు మాత్రం అపార సంపదను సృష్టించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు, ఉదాహరణకు, ఐటి హార్డ్‌వేర్, బయో టెక్నాలజీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ ఈ ప్రయోజనాలు ప్రధానంగా కార్పొరేట్ రంగానికే చేకూరుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి.

మొదట ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి.నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడం అత్యవసరం. రెండవది, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి. మూడవది, రుణాల విషయంలో పారదర్శకత, సురక్షిత రుణవి ధానాలను అమలు చేయాలి. అంతేకాక సామాన్యులకు విద్య, వైద్యం, గృహసౌకర్యాలు అందించే పథకాలు సులభతరం చేయాలి. తద్వారా వారు అప్పులపై ఆధారపడకుండా ఉండగలరు. మోడీ పాలనలో దేశం కొన్ని రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ, సామాన్యుడి జీవనపరిస్థితులు మాత్రం ఆశాజనకంగా లేవు. పెరిగిన అప్పుల భారం, ద్రవ్యోల్బణం, ఉపాధి అవకాశాల కొరత వంటివి పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక స్థిరత్వం, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే సామాన్యుడి జీవితం మరింత కష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. భారతదేశం మొత్తం ఉఆఖ 3.7 ట్రిలియన్ డాలర్లు. అటువంటి పరిస్థితిలో భారతదేశం అప్పు మొత్తం జీడీపీ కంటే తక్కువగా ఉంది. కానీ భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు అప్పుల పరిమాణం చాలా ప్రమాదకరమైనది. ప్రపంచ రుణంలో వాటా గురించి మాట్లాడినట్లయితే, అది 3.2 శాతం. ప్రపంచంలో చాలా తక్కువ రుణాలు ఉన్న దేశాలు ఉన్నాయి. ఇరాక్, చిలీ, చెక్ రిపబ్లిక్, వియత్నాం, హంగరీ, బంగ్లాదేశ్, ఉక్రెయిన్, తైవాన్, రొమేనియా, నార్వే, స్వీడన్, కొలంబియా, ఐర్లాండ్ మరియు ఫిన్లాండ్.

అదే సమయంలో ప్రపంచ రుణంలో పాకిస్తాన్ మొత్తం అప్పుల వాటా 0.3 శాతంగా కనిపించింది.ఎఓఈ నివేదిక ప్రకారం.. 2024 నాటికి ప్రపంచం పెరుగుతున్న అప్పులు పెద్ద సమస్యగా మారాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల అప్పులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. మనం ప్రపంచ రుణం గురించి మాట్లాడినట్లయితే, అది 102 ట్రిలియన్ డాలర్లు అంటే రూ. 8,67,53,95,80,00,00,001. కాగా గ్లోబల్ జిడిపి 110 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అంటే ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి కంటే ప్రపంచ రుణం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ రుణం మొత్తం జిడిపిలో 93 శాతానికి చేరుకుంది. చాలా దేశాలు తమ మొత్తం జిడిపి కంటే ఎక్కువ రుణాలు తీసుకున్నాయి. అంతేకాకుండా, కొన్ని పెద్ద దేశాలు కూడా డిఫాల్ట్ అంచుకు చేరుకున్నాయి.

### జాతి వివక్షత పై పోరాడిన

# నల్ల సూరీడు నెల్సన్ మండేలా

**- భారతరత్న పొందిన విదేశీయుడు**
**- జులై 18 "మండేలా డే"**
**నేడు నేల్సన్ మండేలా జయంతి**



నెల్సన్ మండేలా..! ఓ స్వాప్నికుడు...శాంతి కాముకుడు...విశ్వ శాంతికి సంకేతం... పీడనకు, దోపిడీకి, భయానికి తావులేని సమాజం కావాలనేది ఆయన కల. దక్షిణాఫ్రికా విమోచనోద్యమానికి జీవం. మనిషిని పశువుగానో, పనిముట్టుగానో చూడటంపై నిప్పులు చెరిగిన పోరాట యోధుడు. జాతి వివక్ష, దోపిడీ, బానిసత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన ధిక్కార పతాకం. దక్షిణాఫ్రికాలో దశాబ్దాలుగా కొనసాగిన వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించి 27 ఏండ్లు జైల్లో నిర్బంధిచబడిన వాడు. జాత్యహంకార శ్వేత జాతి ప్రభుత్వం పాటిస్తున్న వివక్షను నిరసిస్తూ ఉద్యమించి నల్ల జాతీయులకు విముక్తి కల్పించిన వీరుడు " నెల్సన్ మండేలా ". అందుకే ప్రపంచంలో ప్రజలను విముక్తి చేయటం కోసం పోరాడిన అతికొద్ది మందిలో ఒకరిగా కీర్తి పొందారు. భౌతికంగా ప్రపంచానికి దూరమైనప్పటికీ, మానవాళి ఉన్నంత కాలం, వివక్ష, అణిచివేత ఉన్నంతకాలం నెల్సన్ మండేలా బతికే ఉంటాడు. సమాజ పరిణామ క్రమంలో బానిసత్వంపై తిరుగుబాటు చేసిన మొదటి తరానికి చెందిన స్పార్టకస్, ఏసుక్రీస్తు పేర్లు ఎలాగైతే అజరామరంగా చలామణిలో ఉంటున్నాయో, విముక్తి ఉద్యమాలు జరిగే చోట, దోపిడి, అణిచివేతలు జరిగే చోట వీరి పేరు ఎలా ప్రతిధ్వనిస్తు న్నాయో...అలాగే 21వ శతాబ్దపు విముక్తి ఉద్యమ వీరుడిగా నెల్సన్ మండేలా పేరు కూడా ప్రతి ధ్వనిస్తూనే ఉంటుంది. అణిచివేతలో మగ్గిపోయి మసిబారిన బొమ్మల్లా ఉన్నవారి కోసం జీవితకాలం ఉద్యమాన్ని కొనసాగించటమే కాదు, తరతరాలుగా తలలు వంచుకొని బ్రతికిన వారిని బ్యాలెట్ ( ఓటుహక్కు ) వరకూ తీసుకెళ్లి వారిని జీవమున్న " మనుషులుగా " నిటారుగా నిలబెట్టెందుకు నేలను చీల్చుకుంటూ ఎగిసిపడిన స్వేచ్ఛా పతాక నెల్సన్ మండేలా. అనేక దశాబ్దాల పాటు కొనసాగిన ఉద్యమం ఫలితంగా 1994 ఏప్రిల్ 26వ తేదీన ఉదయాన్నే పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడిన ఒక ఆఫ్రికన్ యువకుడు తనను పలకరించిన ఓ ఇంగ్లీష్ పత్రిక విలేకరితో " ఇప్పుడు నేను మనిషి " అన్న మాట వెనుక వందల వేల మంది ఆత్మార్పణ ఉంది. త్యాగం ఉంది. వారి రక్తం ఉంది. పోరాట యోధుల చిత్ర హింసలున్నాయి. అందుకే దక్షిణాఫ్రికాకు నెల్సన్ మండేలా మొదటి నల్లజాతి అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పుడు " నేల మీద నడిచే దేవ దూత " అంటూ కొనియాడారు. దక్షిణాఫ్రికా శాంతియుత పరిణామానికి ఎంతగానో పొగడ్తలు, ప్రసంసలు లభించాయి. దక్షిణాఫ్రికా జాతిపితగా, ప్రజాస్వామ్య వ్యవస్థాపకుడిగా ప్రజల ఆదరణ పొందాడు. ఆఫ్రికా జాతి విముక్తి నేతగా పేరొందాడు. నెల్సన్ మండేలా జ్ఞాపకార్థం వివిధ నగరాల్లో మండేలా విగ్రహాలు ప్రతిష్టితమయ్యాయి. 1993లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నాడు. జాతి వివక్ష నిర్మూలన కోసం మండేలా జరిపిన పోరాటానికి గుర్తుగా ఆయన పుట్టినరోజు జూలై 18 " మండేలా డే " గా ఐరాస జనరల్ అసెంబ్లీ 2009 నవంబర్ లో ప్రకటించింది. 1990లో భారత అత్యున్నత పౌరపురస్కారం భారతరత్న ప్రకటించింది. బ్రతికుండగానే ఇలాంటి గౌరవం, పురస్కారాలు అందుకున్న నెల్సన్ మండేలా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. అయితే ప్రపంచ శాంతి అనేది ఒక నినాదంగానే ఉందనేది గుర్తించాలి. ఈ మధ్యకాలంలో అమెరికాలో చోటుచేసుకున్న జాత్యహంకారం ఘటనలు కావచ్చు, మన దేశంలో ఇలాంటి ఘటనలోనే తండ్రీకొడుకులు హతమైన ఘటన కావచ్చు ఇలాంటి మరెన్నో వివక్ష, అణిచివేత దోరణులకు అద్దం పడుతున్నాయి. ఈ తరుణంలో జాతి విముక్తి కోసం, నల్లజాతీయుల యోధుడు నెల్సన్ మండేలా స్ఫూర్తిని పునికిపుచ్చుకోవాలి. జులై 18 "మండేలా డే" ( నెల్సన్ మండేలా పుట్టిన రోజు ) సందర్భంగా నెల్సన్ మండేలాను స్మరించుకుందాం.

# జనాభా పెంపుపై సర్కార్ దృష్టి

## ఇద్దరి కంటే ఎక్కువ మందైతే ప్రోత్సాహకాలు



**విశాఖపట్టణం- సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్య ఎక్కువగా ఆందోళన చెందుతున్న విషయం జనాభా తగ్గుదల. ఏపీ జనాభా పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండటం లేదని.. ఇలాగైతే భవిష్యత్తులో ఊర్లు ఉండవంటూ చంద్రబాబు పలు సందర్భాలలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగానూ చంద్రబాబు మరోసారి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అయితే చంద్రబాబు ఆందోళన వెనుక అనేక కారణాలు ఉన్నాయి.చంద్రబాబు నాయుడు గతంలో జనాభా నియంత్రణ విధానాన్ని గట్టిగా సమర్థించారు. అధిక జనాభా వల్ల ఇబ్బందులు తప్పవన్న ఆయన.. ఒక్కరు ముద్దు అనే విధానాన్ని పాటించాలని అప్పట్లో పిలుపునిచ్చారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోవడంతో చంద్రబాబు స్టాండ్ మారింది. పిల్లల్ని కనండి.. అవసరమైతే ప్రోత్సాహకాలు కూడా ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఏపీలో జనాభా పెరుగుదల రేటు తగ్గడం మంచిది కాదని.. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కొత్త జంటలు పిల్లలను కనాలని ఆయన సూచిస్తున్నారు.

చంద్రబాబు ఈ మధ్య ఓ అడుగు ముందుకేసి.. ముగ్గురు కంటే ఎక్కువమంది పిల్లలను కన్నవారే నిజమైన దేశభక్తులు అనే వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని.. జనాభా స్థిరత్వం కోసం సంతా నోత్పత్తి రేటు 2.1గా ఉండాల్సి ఉండగా.. ఏపీలో సంతా నోత్పత్తి రేటు 1.7గా ఉందని చంద్రబాబు చెబుతున్నారు. చంద్రబాబు ఎందుకిలా పిల్లలను కనమని చెప్తున్నారో చైనా, జపాన్ దేశాలను చూస్తే అర్థమవుతుందని విశ్లే షకులు చెప్తున్నారు. ఎందుకంటే పిల్లల్నికనే జంటలకు ఈ దేశాల్లో ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. 'ఒక్కరు ముద్దు - ఇద్దర వద్దు' అంటూ గతంలో పిలుపునిచ్చిన కమ్యూనిస్టు దేశం చైనా.. ఇప్పుడు యువ జనాభా తగ్గుదలతో ఇబ్బందులు పడుతోంది. పనిచేసే యువకుల సంఖ్య తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో చైనా ఆర్థిక రంగం మీద ఆ ప్రభావం పడుతోంది.

దీంతో అప్రమత్తమైన బీజింగ్ పాలకులు పిల్లలను కనాలని చైనీయులను కోరుతున్నారు. పిల్లలను కనే వారికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. చైనాలోని ఇన్నర్ మంగోలియాలో.. రెండో బిడ్డను కన్న జంటకు 50 వేల యువాన్లు అందిస్తున్నారు. ఇది భారత కరెన్సీలో దాదాపు రూ.6 లక్షలు. ఇక మూడో బిడ్డను కన్న దంపతులకు లక్ష యువాన్లు అందిస్తోంది అక్కడి ప్రభుత్వం.చైనాలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు.. పిల్లలను కనే జంటల కోసం ఇలాంటి రాయితీలను ఇప్పటికే ప్రకటించాయి. ఇల్లు కట్టుకోవడానికీ రాయితీలు అందిస్తున్నారు. పుట్టే ప్రతి బిడ్డకు ఏడాదికి 3600 యువాన్ల చొప్పున.. మూడేళ్లపాటు ఇవ్వాలనే యోచనలో చైనా ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఆ లెక్కన పుట్టే ప్రతి బిడ్డకు కూడా మన భారతీయ కరెన్సీ ప్రకారం ఏటా రూ.43000 ఇవ్వాలనే ఆలోచన చైనా ప్రభుత్వం చేస్తోంది.ఒక దేశం లేదా రాష్ట్రంలో జనాభా స్థిరంగా పెరగకపోతే అది దాని ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

పెరిగిన మౌలిక వసతులు, వైద్యారోగ్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా.. సగటు మనిషి ఆయుర్దాయం పెరిగింది. అలాగే మారుతున్న జీవన శైలి, విపరీతంగా పెరుగుతున్న ఖర్చులు, చిన్న కుటుంబాల కారణంగా నేటి యువత పెళ్లి పట్ల, పిల్లలను కనడం పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఏటేటా వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. పనిచేసే యువ జనాభా తగ్గుముఖం పడుతోంది. దీంతో ఉత్పత్తి తగ్గి.. ఆర్థిక వ్యవస్థలో వేగం తగ్గుతుంది. పనిచేసే వారి సంఖ్య తగ్గితే అది ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే వృద్ధుల సంరక్షణ కోసం చేసే ఖర్చు కూడా ప్రభుత్వాలకు భారంగా మారుతుంది.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే సంతానోత్పత్తి రేటు తగ్గుతోందనేది చంద్రబాబు ఆందోళన.

పరిస్థితి ఇలాగే కొనసాగితే మన రాష్ట్రంలోనూ యువత తగ్గిపోతారని చంద్రబాబు అంటున్నారు. ఇందులో రాజకీయ కోణం కూడా లేకపోలేదు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని.. ఇన్నాళ్లు కుటుంబ నియంత్రణను పటిష్టంగా అమలు చేసిన తమకు పార్లమెంట్‌లో ప్రాధాన్యత తగ్గుతుందనేది దక్షిణాది రాష్ట్రాల ఆందోళన. దీంతో తమిళనాడు సీఎం స్టాలిన్ సైతం పిల్లలను కనాలని పిలుపునిస్తున్నారు.ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లేకపోయేది. ఈ చట్టంలో చంద్రబాబు మార్పులు చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాతృత్వ సెలవులు, పితృత్వ సెలవుల విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేస్తోంది. అయితే జనాభా పెరుగుదల కోసం చంద్రబాబు చెప్తున్న కారణాలపైనా భిన్నమైన వాదనలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఉన్న చైనాను ఇండియా వెనక్కి నెట్టింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ జనాభాకు అవసరమైన మౌలిక వసతులు.. కూడు, గూడు, గుడ్డ లాంటి కనీస అవసరాలు అందని అభాగ్యులు కూడా మనదేశంలో ఉన్నారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది.అలాగే ప్రస్తుతం విద్య, వైద్యం మనదేశంలో చాలా ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది. జీవన వ్యయం కూడా భారీగా పెరిగింది. దీంతో భార్యాభర్తలిద్దరూ పని చేస్తే గానీ పిల్లలను చదివించలేని పరిస్థితి. ఇప్పటికే ఉపాధి కోసం యువ జంటలు నగరాల్లో నివాసం ఉంటుండగా.. పెద్దలు మాత్రం సొంతూర్లలో ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరికి మించి పిల్లలను కనడం సాధ్యమేనా అనే ప్రశ్న వినిపిస్తోంది. చిన్న ఊళ్లలోనూ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. పిల్లలను కంటూ పోతే.. వారి బాగోగులు ఎవరు చూసుకుంటారు అని ప్రశ్నించే వారూ ఉన్నారు.ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కనడానికి యువ జంటలు ముందుకు రావాలంటే.. ప్రభుత్వం నుంచి మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తల్లికి వందనం వంటి పథకాల ద్వారా చిన్నారుల చదువుకు ఆర్థిక భరోసా అందిస్తున్నప్పటికీ.. అది పిల్లల చదువు కోసమే ఖర్చయ్యే పరిస్థితి. పిల్లలు పుట్టగానే వారి ఖాతాలో కొంత నగదు జమ చేయడంతోపాటు.. పిల్లలకు కనీసం ఐదేళ్లు వచ్చే వరకూ ఏటా కొంత మొత్తం ఆర్థిక సహకారం అందించడం.. విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు చేయడం ఎంతో అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇవన్నీ చేయాలంటే భారీ మొత్తంలో నిధులతోపాటు ప్రభుత్వానికి ఓ ప్రణాళిక, సన్నద్ధత అవసరం. ఎక్కువ మంది పిల్లలను కనడం ద్వారా.. తమ దేశభక్తి నిరూపించుకోవడానికి యువ జంటలు సిద్ధపడాలంటే.. అంత కంటే ముందు తగిన కార్యాచరణ రూపొందించడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచండి

**- అవసరమయ్యే మందులను ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండేలా చూడండి**


**- మండల ప్రత్యేక అధికారి, ఎమ్మార్వో, ఎంపీడీఓ తరచుగా పర్యవేక్షించాలి**

**- కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని (ఎస్డబ్ల్యూపిసి) ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**


**రాయచోటి టౌన్ - సూర్య వాస్తవం, జూలై 17:** అన్నమయ్య జిల్లా కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరింత పరిశుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వైద్యాధికారులు సిబ్బందిని ఆదేశించారు. గురు వారం ఉదయం కురబలకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ప్రతిరోజు ఓపి ఎంత వస్తున్నారు, ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారని, వైద్య ఆరోగ్య సిబ్బంది పని తీరు, రక్త పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నారా లేదా, డయాబెటిస్, హైపర్ టెన్షన్ తదితర సంబంధిత వ్యాధిగ్రస్తులు ఎంతమంది వస్తున్నారని, ప్రజలకు అవసరమయ్యే అత్యవసర మందులు కొరత ఏవేవి ఉన్నాయని తదితర అంశాలను కలెక్టర్ డాక్టర్ చక్రవర్తి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది స్నేహపూర్వకంగా మెలిగారా లేదా వంటి అంశాలపై ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమయ్యే మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అవసరమైన మందులను తెప్పించుటకు ఇండెంట్ ను ఎప్పటికప్పుడు తయారుచేసి పంపాలన్నారు. అలాగే మెడికల్ ఆఫీసర్లు ప్రజలతో మానవతా దృక్పథంతో మెలగాలని, తమ సిబ్బందికి కౌన్సిలింగ్ చేసి సిబ్బంది ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలిగేలా చూడాలని, ప్రజల నుండి సిబ్బంది యొక్క ప్రవర్తనపై అభిప్రాయాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని పీహెచ్సీలలో మెడికల్ అధికారులు ప్రజలతో మంచి ప్రవర్తనతో మెలిగినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం లేదని వారు తమ ప్రవర్తనను మార్చుకొని ప్రజలతో సఖ్యతగా మెలగాలన్నారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్, మేటర్నల్ హెల్త్, నియోనేటల్ హెల్త్, అభ ఐడి మ్యాపింగ్, తదితర అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పిహెచ్సిలు పనిచేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సేవలు మిగిలిన సేవలు కంటే ప్రజలకు అత్యవసరమని చాలా ఉన్నతమైన సేవ అని పేర్కొన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రతి 15 రోజులకు ఒకసారి మండల ప్రత్యేక అధికారి, ఎమ్మార్వో, ఎంపీడీవో అంగన్వాడి సెంటర్లు, స్కూల్లు పిహెచ్సి ఎస్ డబ్ల్యూ పిసి, హాస్టల్లో విజిట్ చేయాలని వచ్చిన ప్రతిసారి విజిటర్స్ బుక్ నందు మీ అభిప్రాయాలను అందులో నమోదు చేయాలని, ఏవైనా సమ స్యలు ఉంటే సంబంధిత అధికా రుల తో చర్చించి వాటిని పరిష్క రించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో పరిశుభ్రత ఇంకా మరింత మెరుగు పడేలా చూడాలని డాక్టర్, సిబ్బందికి తెలియజేశారు.







**అనంతరం కురబలకోట చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని (ఎస్డబ్ల్యూపిసి) పరిశీలించిన జిల్లా కలెక్టర్:** కురబలకోట గ్రామ పంచాయతీలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎంతమంది పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు, రోజూ ఎంత చెత్త వస్తుంది, సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేస్తున్నారు, తడి చెత్త పొడి చెత్త విడివిడిగా వేరు చేస్తున్నారా లేదా, నేడు ఎంత మంది నుంచి చెత్త సేకరించారు, గృహాల నుండి చెత్తను ఏ సమయం నుండి ఏ సమయం లోపల సేకరిస్తున్నారు, ట్రై సైకిల్, ఆటోలు ఎన్ని ఉన్నాయని, శానిటేషన్ వర్కర్లకు జీతభత్యాలు ఎప్పటివరకు ఇచ్చారు, ఈ ఎరువును అమ్ము తున్నారా తీసుకెళ్ళుటకు రైతులు ముందుకు వస్తున్నారా, 15 వ ఆర్థిక సంఘం నిధులు ఎంత ఉన్నాయి సంబంధిత వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండే ఇంటింటి నుండి తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఐవిఆర్ఎస్ కాల్స్ అంగళ్లు, కురబలకోట పాజిటివ్ రెస్పాన్స్ 85 శాతం ప్రజల నుండి అభిప్రాయాన్ని తెలిపారని ఇంకా మంచి పురోగతి సాధించాలన్నారు. అలాగే మట్లి వారి పల్లి నందు గ్రీన్ అంబాసిడర్ల కొరత, వారి జీతభత్యాలకు నిధుల కొరత, ట్రై సైకిల్స్ ద్వారా చెత్త సేకరించుటకు ఒక గ్రామం నుండి మరొక గ్రామా నికి వెళ్ళుటకు దాదాపు రెండు నుంచి మూ డు కిలోమీటర్ల దూరం వస్తున్నదని అందువల్ల ఆ గ్రామా లలో కొంత వెనకబడి ఉన్నామని ఎంపీడీవో తెలిపారు. చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని (ఎస్డబ్ల్యూపిసి) తడి పొడి చెత్తను వేరు చేయుటకు చెత్తంతా రోడ్డు పైన వేసారని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసు కోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ధనుంజయలు, ఎంపీడీవో గంగయ్య, డాక్టర్ చక్రపాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మీ బంగారు భవిష్యత్తుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోండి...


**- విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ పై అవగాహన కల్పించిన సీఐ గంటా సుబ్బారావు**




**ఆదోని - సూర్య వాస్తవం, జూలై 17:** ఆదోని పట్టణంలోని స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో కర్నూలుజిల్లా ఎస్పీ ఆదేశాలతో ఆదోని డిఎస్పి పర్యవేక్షణలో సీఐ గంటా సుబ్బారావు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈవ్ టీజింగ్, సైబర్ నేరగాళ్ల ముఖ్యంగా సెల్ ఫోన్ యాప్‌లు, మైనర్ డ్రైవింగ్ పైన అవగాహన కల్పించారు. సిగరెట్స్, డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శారీరక మానసిక, ఆరోగ్య పరంగా ఉండడమే కాకుండా, క్రమశిక్షణ అలవర్చుకోవాలని బాలికలకు తెలియజేశారు. కళాశాల విద్యార్థులు సెల్ ఫోన్ల వాడకంపై ప్రత్యేక ఆకర్షణకు గురవుతున్నారని, వాటికి దూరంగా ఉంటూ.. తమ భవిష్యత్తు తీర్చిదిద్దుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## మున్సిపల్ సెక్షన్ కార్మికుల సమ్మె ఐదో రోజు

**- సిఐటియు,ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన**





**గుత్తి-సూర్య వాస్తవం,జులై 17 :** గుత్తిలో మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు,పారిశుద్ధ కార్మికు లు సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది సందర్భంగా మున్సిపల్ ఆఫీస్ నుండి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మోకాళ్ళ పైనకుర్చుని నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వి నిర్మల ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్ రైతు సంఘం నాయకులు రామకృష్ణ పారిశుద్ధ కార్మికుడు సూర్యనా రాయణ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు 36 నెంబర్ జీవో అమలు చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సమాన పనికి సమానవేతనం 26 వేలు ఇవ్వాలని మున్సిపల్ పారిశుద్ధ కార్మికు లను ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని డిమాండ్ చేశారు కార్యక్ర మంలో పాల్గొన్న మున్సిపల్ ఇం జనీరింగ్ సెక్షన్ అధ్యక్షులు రాజు మురళి ఆది రవి మున్సిపల్ పరి శుద్ధ కార్మికులు సంఘం అధ్యక్షు లు సూర్యనారాయణ కార్యదర్శి రామానుజన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయండి

**- విద్యుత్ శాఖ సీఎండీ సంతోషరావుకు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి**

**- తిరుపతిలోని కార్యాలయంలో సీఎండీకి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 17:** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ సీఎండీని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఏపీ కార్యాలయంలో సీఎండీ సంతోషరావును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. నగరంలో కొన్ని చోట్ల అదనంగా సబ్ స్టేషన్లను నిర్మించాల్సి ఉందన్నారు. ఇప్పటికే స్థల సేకరణ కూడా చేస్తున్నామని త్వరితగతిన వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే నూతన ట్రాన్స్ ఫార్మర్లు కూడా రూరల్ పరిధిలో ఎక్కువగా అవసరం ఉందన్నారు. వాటిని కూడా మంజూరు చేయాలని కోరారు. కొన్ని చోట్ల విద్యుత్ లైన్లు ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని వాటిని పూర్తిగా మార్చాల్సి ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. దీనిపై సీఎండీ సంతోషరావు సానుకూలంగా స్పందించారు. అనంతపురంజిల్లా ఎస్ఈతో మాట్లాడి వెంటనే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు.

## సబ్ జైల్ రికార్డులను పరిశీలించిన సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి




**రాయచోటి టౌన్ - సూర్య వాస్తవం, జూలై 17:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరి సరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో రాయచోటి సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌ని కలిసిన సీడ్స్ చైర్మన్

**- ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి గౌతమ్ కుమార్ రెడ్డి**




**డోన్- సూర్య వాస్తవం, జూలై 17:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ కుమార్ రెడ్డి ఉండవల్లి లోని వారి నివాసంలో కలసిన ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి డోన్ నియోజ కవర్గంలో కష్టపడిన టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తూ పదవులు ఇవ్వాలని ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి కోరారు. యువగళం పాదయాత్రలో ప్యాపిలి పట్టణంలో 900కీ.మీ శీలాఫలకం ఆవిష్కరణ చేసినపుడు గుండాల ఇరిగేషన్ ప్రాజెక్టు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు అదేవిధంగా డోన్ నియోజకవర్గం ప్రస్తుత పరిస్థితుల గురించి మాట్లాడటం జరిగింది.

## బంగారు కుటుంబాల సమక్షంలో వార్డు సభ

**- గుత్తి మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జీరో పావర్టీ-పి4 వార్డు కార్యక్రమం నిర్వహణ సభ**



**గుత్తి-సూర్యవాస్తవం,జులై 17:** గుత్తి పట్టణం సచివాలయం.8 యస్.సి కాలనీ-2లో బంగారు కుటుంబముల సమక్షంలో వార్డు సభ నిర్వహించడమైనది. ఇందులో జీరో పావర్టీ పి4కు సంబంధించి ఉద్దేశ్యము, బంగారు కుటుంబాల ఎంపిక, మార్గ దర్శుల అడాప్షన్ గురించి మున్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా వివరించారు. సభలో రీవాలిడేషన్ ప్రక్రియ కూడా చేప ట్టడమైనదని కమీషనర్ బి.జ బ్బార్ మియా తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు సి.ఓలు చంద్రశేఖర్, ప్రసన్నబాబు, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్.పిలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌ను సన్మానించిన లైన్స్ క్లబ్ సభ్యులు



**పామిడి -సూర్యవాస్తవం,జులై 17:** పామిడి మండలనికి నూతనంగా విచ్చేసిన టువంటి తహసిల్దార్ షర్మిల ని, డిప్యూటి తహసిల్దార్ రామకృష్ణ, రీ సర్వే డిప్యూటి తహసిల్దార్ సురేఖని పామిడి లయన్స్ క్లబ్ సభ్యులు శాలువా కప్పి పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మా నించారు తహసి ల్దారె షర్మిల పామిడి లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. ము న్ముందు పామిడి చుట్టుపక్కల మండలాల ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలని తెలిపారు, పామిడి లయన్స్ క్లబ్ కు తన వంతు సహమ సహకారాలు, ఉంటామని తెలియజేశారు. ఈ కర్యక్రమంతో పామిడి లయన్స్ వ్యవస్థ పక అధ్యాక్షడు.డు, ప్రభుత్వ ఆయుక్షి వైద్యాధికారి డా.నల్లపాటి తిరుపతి నాముడు క్లబ్ అధ్యక్షడు రఘువీర్ రావు ప్రధాన కార్యదర్శి పటా శ్రీనివాసులు డిస్ట్రిప్ట్ చైర్ పర్సన్స్ డా. మురళి కిష్ణ, పి.సె జమరామరావు, డైరెక్టర్ పి.పి.సె. సుహెూసే తదితరులు పాల్గొన్నారుల.

## టీడీపీ నాయకుడికి నివాళులు అర్పించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**పామిడి-సూర్య వాస్తవం,జూలై 17:** పామిడి మండలం ఎద్దులపల్లి గ్రామం నందు టీడీపీ నాయకుడు రాజు తండ్రి వెంకటేష్ అనారోగ్యం కారణంగా మరణించడం జరిగింది, ఈ విషయం తెలుసుకున్న గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత పామిడి, గుత్తి ఇంచార్జ్, గుమ్మనూరు ఈశ్వర్ ఎద్దులపల్లి గ్రామానికి వెళ్లి వెంకటేష్ మృతదేహానికి పూల మాల వేసి నివాళలు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, అనంతరం రాజుతో ధైర్యంగా ఉండాలని మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎద్దులపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సహకార సంఘం చైర్మన్‌ను సన్మానించిన జనసైనికులు



**పామిడి- సూర్య వాస్తవం,జులై 17:** తెలుగుదేశం పార్టీలో కొన్ని సంవత్సరాల నుంచి కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని మరోసారి రుజువైనది ఎందుకంటే పామిడి మండలం ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ కంచుకోటగా ఉండి పార్టీని నమ్ముకున్న దానికి పట్టణానికి చెందిన బొల్లు శ్రీనివాసులు రెడ్డికి సహకార సంఘం చైర్మన్గా అవకాశం దక్కింది విరితో పాటు కూటమి నాయకులు కూడా మండల ప్రధాన కార్యదర్శి షేక్షా వలి తండ్రికి సహకారం సంఘం డైరెక్టర్గా నల్లకాదరుబాషాకు అవకాశం కల్పి ంచారు అందులో భాగంగానే గురువారం పామిడి మండల జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బి శ్రీనివాసులు రెడ్డికి ప్రధాన కార్యదర్శి షేక్షావలికి సన్మానించారు అనం తరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన దానికి గుంతకల్ నియోజకవర్గం శాసన సభ్యుడు గుమ్మనూరు జయరాం ప్రత్యేక ధన్యవాదాలు ఈ అవకాశాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానన్నారు గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు కూడా కలిసి వచ్చి నాకు సన్మానించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపా ధ్యక్షులు శరత్, ప్రధాన కార్యదర్శులు కరూర్ జగదీష్,షేక్షావలి ,సంయుక్త కార్యదర్శి లాలు , ఆటో సిద్ధ, వడ్డే రాము,కత్రిమల సుబ్బు, సూర్య,జమీర్, ఖాజా, తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బి మోహన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి చీమల రాము,అప్పన్న కుమార్, వడ్డే రామంజి,నారాయణస్వామి, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

**- ప్రాథమిక విద్యాభివృద్ధికి పాటుపడాలి,**
**- నాయకత్వ లక్షణాలపై ముగిసిన శిక్షణ**





**రాయచోటి టౌన్ - సూర్య వాస్తవం, జులై 17:** నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని ప్రాథ మిక విద్యాభివృద్ధికి కృషి చేయాలని డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి సూచి ంచారు. అర్చన కళాశాలలో జిల్లాలోని 280 మంది మోడల్ ప్రాథమిక పాఠశాలల, ఉన్నత ప్రధానోపాధ్యాయులకు గత నాలుగు రోజుల నుండి నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తరగతికి ఒక ఉపాధ్యాయుడు కేటాయించడం వలన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి మోడల్ ప్రాథమిక పాఠశాలలు తోడ్పడుతాయన్నారు. నూతనంగా ఏర్పడిన ఈ మోడల్ ప్రాథమిక పాఠశాలలకు మౌలిక సదుపాయాలను కల్పించుకుని విద్యార్థులలో అభ్యసన ఫలితాలను అభివృద్ధి చేయాలన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని తల్లిదండ్రుల సహకారంతో ఈ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్చన కళాశాలల కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ఏ ఎం ఓ సమీముల్లా, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు, మాస్టర్ ఫెసిలిటేటర్స్, మోడల్ ప్రాథమిక పాఠశాలల, ఉన్నత ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజకీయ నాయకులను కలిసి కృత జ్ఞతలు తెలిపిన పాటిల్ సురేష్





**గుత్తి-సూర్య వాస్తవం,జులై 17 :** గుత్తి పట్టణానికి చెందిన జనసేన పార్టీ గుత్తి పట్టణ అధ్యక్షులు పాటిల్ సురేష్‌ని మామూడూరు సహకార సొసైటీ బ్యాంకు చైర్మన్‌గా నియమించినందుకు గాను తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కార్మిక సంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడుయాదవ్, గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుంతకల్లు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ వారి స్వగృహంల నందు మర్యా దపూర్వకంగా కలిసి తననియా మకానికి సహకరిం చినందుకు కృతజ్ఞతగా ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో కూరగాయల బొకే,పూలమాలతో శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ డై రెక్టర్‌లు.పి.రామ కొండయ్య యాదవ్,కె.కర్ణ,జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మిద్దె ఓబులేష్ నందీశ్వర,డీలర్ వీరాంజనేయులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న రాష్ట్రం

**- చంద్రబాబు తగినంత రాష్ట్ర ప్రయోజనాల కోసం..**
**- విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం శ్రమిస్తూ లోకేష్ బాబు**
**- ప్రజాసేవే పరమావధిగా మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి**
**- టిడిపి రాష్ట్ర కార్యదర్శి, గాజుల ఖాదర్ బాషా**



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 17:**ప్రజాస్వామ్యాన్ని హేళన చేసే విధంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడు తున్నారని గాజుల ఖాదర్బాషా అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాను సారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 103వ బూతులో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో గాజుల ఖాదర భాష ఇంటింటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వృద్ధులకుపెన్షన్లు 4000 రూపాయలు ఇస్తున్నందుకు వారు సంతోషముతో కరపత్రంపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోను కళ్ళకు అద్దు కొని దేవుడు లాంటి వారు చంద్రబాబు నాయుడు అని చెబుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చాలా బాగున్నదనీ గత ప్రభుత్వంలో అనేక రకాలుగా ఇబ్బం దులు పడ్డామని ప్రజలు తెలిపారని చెప్పారు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, వైసిపి నేతలకి ఎంతసేపు శవ రాజకీయాలపై దృష్టి తప్ప మరొకటి లేదన్నారు. రాష్ట్రం కోసం పనిచేస్తున్న నాయకుడు ఎవరు? శవ రాజకీయాలు చేస్తున్న నాయకుడు ఎవర నేది ప్రజలకు స్పష్టంగా తెలుసని వారన్నారు. అభివృద్ధిలో ముందుకు వెళుతున్న రాష్ట్రానికి నష్టం చేయాలని అనేక ప్రయత్నాలు వైసిపి వారు చేస్తున్నారని ఆయన చెప్పారు.కుటుంబంలో కష్టాలు సమస్యలు ఏదైనా ఉంటే మంత్రి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి వెళితే తప్పకుండా పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అమావాస్య రెడ్డయ్య, మంజునాథ్, రోఫా, అమీర్ భాష, హైదర్, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యసనంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**- గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యం**
**- డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి వెలడి**



**రాయచోటి టౌన్ - సూర్య వాస్తవం, జూలై 17:** ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఉదయం రాయచోటి పట్టణం కొత్తపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై అధ్యయనాన్ని డైట్ తరపున ఆయన చేపట్టారు. గత సంవత్సరం 3వ తరగతి పూర్తి చేసుకుని ప్రస్తుతం 4వ తరగతిలో ఉన్న 20 మంది విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుగు, ఆంగ్లం, గణితం నందు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి నమోదు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులలో వినడం,మాట్లాడ్డం, చదవడం, రాయడం వంటి కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయడం ప్రాథమిక విద్యలో ప్రధానమన్నారు. తెలుగు, ఆంగ్లం భాషల పిరియడ్ నందు అందమైన చేతి వ్రాత వచ్చేలా ప్రతిరోజు ప్రాక్టీస్ చేయించాలన్నారు.గణిత బోధనలో తరగతి వారీగా పట్టికలపై మౌఖిక సాధనను చేపట్టాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి బోధన చేయడం ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుంటారన్నారు. ఇందుకోసంతరగతి వారీ చార్టులు, కథల పుస్తకాలు, డ్రాయింగ్, పెయింటింగ్ సామాగ్రి, వర్క్ షీట్లు, వర్క్ బుక్కులు, పోస్టర్లు, క్రాఫ్ట్ వస్తువుల వంటి అభ్యసన సామాగ్రిని ప్రతి విద్యార్థికి సమకూ ర్చాలన్నారు. నో బ్యాగ్ డే రోజు పేపర్ కటింగ్ లు, డ్రాయింగ్, పాటలు, నృత్యం వంటి వినూత్న కార్యక్రమాలలో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహి ంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపా ధ్యా యులు వెంకటయ్య, శ్రీవాణి, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ

# పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

**- జూలై మూడో శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడం అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**రాయచోటి-సూర్య వాస్తవం,జూలై 17:** అమరావతి లోని సచివాలయం నుండి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయా నంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పి-4, పాజిటివ్ పీపుల్ పర్సెప్షన్, ఎం ఎస్ ఎం ఈ పార్కులు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి 4 కార్యక్రమంలో ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శులతో మ్యాప్ చేసే ప్రక్రియ జరుగుతోందని అన్నమయ్య జిల్లాలో గుర్తించబడిన బంగారు కుటుంబాలను మార్గదర్శులతో మ్యాప్ చేసే ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. గ్రామ సభల నిర్వహణ బంగారు కుటుంబాల అవసరాల గుర్తింపు తదితర ప్రక్రియలను త్వరగా పూర్తిచేసి మ్యాప్ చేయాలన్నారు. జనాభా నిర్వహణపై ప్రభుత్వ విధానాన్ని తయారు చేసేందుకు ప్రజల నుండి తీసుకున్న అభిప్రాయాలను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లాలోని 6 నియోజకవర్గాలలో 6 ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటుకు భూమి అవసరమైన నియోజకవర్గాలలో భూమి కేటాయింపు జరగాలన్నారు. ప్రపంచ బ్యాంకు చేయూతతో నిర్వహిస్తున్న ర్యాంప్ ప్రాజెక్టు లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రే షన్ సేవలు పంచాయతీరాజ్ సేవలు, రేషన్ పంపిణీ,దీపం 2.0, ఏపీఎస్ఆర్టీసీ సేవలపై ప్రజల నుండి తీసుకున్న అభిప్రా యాలను సమీక్షించు కొని ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశిం చారు. ప్రభుత్వ సేవలు మరియు ప్రభుత్వ పనులకు ఉపయోగకరంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జెన్ చాట్ బాట్ ప్రాజెక్టుకు సహకరించేలా చర్యలు చేపట్టాలని సిపిఓ ను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు.

ప్రతి నెల మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల మూడో శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీనికి అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు కళాశాలలో ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన పెంచి ప్లాస్టిక్ వాడటానికి తగ్గించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామంలో ప్రజాదర్బార్

**- ప్రభుత్వం అందించే అభివృద్ధి,**
**సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తెలియజేయండి**

**రాయచోటి-సూర్య వాస్తవం,జులై 17:** రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గురువారం తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లి లో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్చంతో సత్కరించి సన్మానించారు.



# 9వ రోజు సుపరిపాలనలో ఎమ్మెల్యే కందికుంట

**కదిరి –సూర్య వాస్తవం, జూలై17:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది నడుస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మన ఇంటికి మన ఎమ్మెల్యే ,సుపరిపాలనలో తొలి అడుగు 9వ రోజు కార్యక్రమాన్ని పురస్కరించుకుంటూ ఇంటింటా నిర్వహిస్తూ కదిరి నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీ 33 వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరై ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి, కార్యక్రమాల వివరాలను అందరికీ అందుతున్నాయా లేదా అనే నేపథ్యంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం, సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులను మమేకం చేస్తూ పరిష్కరించారు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో రానున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి లబ్ధిదారులకు పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు, ఇంకా స్థానిక సమస్యల పై ఆరా తీస్తూ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులను ఆదేశించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర జన వనరుల గురించి కేంద్ర ప్రభుత్వంతో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో రాష్ట్రానికి మేలు జరుగుతుంది అని కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు కురిపించారు జల వనరుల ద్వారా రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందని కుట్రపూరితమైన చర్యకు జగన్మోహన్ రెడ్డి మాట్లాడే విధానం హాస్యాస్పదంగా



ఉందని తొలుత ఆయన తెలుగును సరిగ్గా ఉచ్చరించేది నేర్చుకోవాలని సూచించారు, సొంత చెల్లికే న్యాయం చేయలేని అన్నయ్య ప్రజలకు సైతం ఏం న్యాయం చేయగలరు అని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి జగన్ మోహన్ రెడ్డి చిన్నాన్న ఆయన వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏమాత్రం పురోగతిని లేకుండా జగన్ అనిసివేశాడని విమర్శించారు ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ చైర్పర్సన్ దిల్షాద్ నిషా బహావుద్దీన్ , తెలుగుదేశం పార్టీ నాయకులు కె.ఎస్ బహావుద్దీన్, వైస్ చైర్పర్సన్ సేగు సుధారాణి , రాజశేఖర్ ఆచారి, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సలాంబిడి ఇస్మాయిల్, స్థానిక కౌన్సిలర్ పాశం రమణ నాయుడు, మాజీ కౌన్సిలర్లు హుస్సేన్ భాష, మునిరత్నం, అంజి, చౌదరి, నంద నాయక్, చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు కే కృష్ణప్ప, బండారు మురళి, ఉట్టి ఓం ప్రకాష్, మహబూబ్ బాషా, సి ఏ ఇస్మాయిల్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కృష్ణమూర్తి, కాటం మనోజ్, ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, మహిళా నాయకురాలు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న సీట్లు ఎవరికోసం ?

### -ప్రయాణికులకా! మందుబాబులకా!

**రాయచోటి–సూర్యవాస్తవం, జులై 17:** వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అన్నమ య్య జిల్లా కేంద్రమైన రాయచో టి ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకుం టారు. బస్ ఆలస్యమైతే ప్రయాణికుల కోసం కూ ర్చోడానికి ఆర్టీసీ సంస్థ బస్టాండ్‌లో సీట్లను ఏర్పాటు చేసిందది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా ఉన్న సమయంలో అక్కడ ముగ్గురు ప్రయాణి కులు కూర్చుండే కుర్చీలలో ఎవరో వ్యక్తి పీకల దాకా మందు తాగి జల్సాగా పడుకొని కూని రాగాలు తీస్తున్నాడు. ప్రయాణికులు మాత్రం చూస్తూ ఏమి చేయలేక బస్సు కోసం పక్కన నిలబడే ఉన్నారు. పక్కనే ఉన్న ఆర్టీసీ కంట్రోలర్, ఆర్టీసీ పోలీస్ చూస్తున్నారే తప్ప ఆ వ్యక్తిని లేపక పోగ చరవాణి సంభాషణలో నిమగ్నమై ఉన్నారు.ఆ సమయంలో ఉద్యోగులు,పాఠశాల విద్యార్థులు బస్సుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఆర్టీసీ సంస్థ ప్రయాణికులు కూర్చోవడానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలను ఏర్పాటు చేశారు. అక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తూ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు వాపో తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ప్రజలు తప్పుపడుతున్నారు. ఇలాంటి మందుబాబుల దృశ్యాలు బస్టాండ్‌లో కనిపించకుండా ఆర్టిసిపే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## నేడు డంపింగ్ యార్డులో

# బయోమైనింగ్‌ను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

**- రూ.12.217కోట్లతో 1,68,285 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపుకు శ్రీకారం**

**- 7 డివిజన్లలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలను ప్రారంభించనున్న దగ్గుపాటి**

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 17:** అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అడుగులు వేస్తున్నారు. ఇందులో మొదటి అంకానికి నేడు శ్రీకారం చుట్టనున్నారు. డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను తరలించేందుకు నేడు బయోమైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. డంపింగ్ యార్డు వలన ఇప్పటికే రాజీవ్ కాలనీ పంచాయతీ పాటు మరికొన్ని కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జాతీయ రహదారిలో



వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించబోతున్నారు. ప్రస్తుతం ఇక్కడున్న చెత్తను బయోమైనింగ్ ద్వారా ఎరువుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకో ఇటీవల టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైంది. జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సెల్యూషన్స్ సంస్థ ఈ పనులు చేయబోతోంది. మొత్తం రూ.12.217కోట్లకు టెండర్ దక్కించుకుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన మిషన్లను డింపింగ్ యార్డులో అమర్చారు. 1,68,285 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించనున్నారు. నేడు ఈ పనులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించనున్నారు. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. పారదర్శకంగా ఈ ప్రక్రియ సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు 2, 18, 19, 20, 20, 24 డివిజన్లలో డ్రైనేజీలు, 5వ డివిజన్ లో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. మొత్తం కోటి 70లక్షలతో ఈ పనులను చేపడుతున్నారు.

## ఓ వైకాపా నాయకుడా .. ఆత్మ విమర్శ చేసుకో



**కదిరి–సూర్య వాస్తవం, జులై 17:** కదిరి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కార్యకర్తలు పట్ల, నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలకు స్పందిస్తూ నల్లచెరువు మండల జడ్పిటిసి అనిత భర్త అయినటువంటి బసిరెడ్డి విశ్వనాథరెడ్డి తీవ్రంగా ఖండించారు గురువారం కదిరిలో ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కి కోవర్టుగా పనిచేస్తున్నానని నాపై విమర్శలు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు గత ఎన్నికలలో ఎన్నో కష్టనష్టాలతో కుటుంబం సైతం వైఎస్ఆర్సిపి ఇంటింటికి ప్రచారం చేస్తూ కష్టపడ్డామని తెలిపారు అయితే ఇవన్నీ ఏమి పట్టనట్టు కార్యకర్తలను ఉన్నపలంగా దూషిస్తూ ,నిరుత్సాహపరుస్తూ తన ఒంటెద్దు పోకడలను ప్రదర్శిస్తూ కష్టపడిన కార్యకర్తలను, నాయకులను పార్టీకి దూరం చేస్తున్నారని విమర్శించారు, ఇలాగైతే భవిష్యత్తులో వైఎస్ఆర్సిపి మనుగడ అసాధ్యమని తెలియజేశారు, గత ఎన్నికలలో వైకాపా నాయకుడు మూడు నెలల క్రితమే సీజనల్ నాయకుడిగా కదిరి రాజకీయాలలో ప్రవేశించి కార్యకర్తలను నాయకులను విమర్శల పాలు చేస్తూ నానా ఇబ్బందులు పాలు చేస్తున్నారని తెలిపారు ఇలాంటి వంటేద్దు పోకోడలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పార్టీ టికెట్ దక్కడం కాగా, గత ఎన్నికలలో లాగా 6000 పైచిలుకు ఓట్లకు కంటే 60 వేల ఓట్లు రైతులకు ఓట్లకు ఓటమి రుచి చూస్తారని హెచ్చరించారు, పార్టీ ఓటమి అనంతరం కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం కాకుండా వారిపై తీవ్ర విమర్శలను కురిపిస్తూ పార్టీ ప్రతిష్టతకు భంగం కలిగించే విధంగా మాట్లాడడం చాలా బాధ కలిగించిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో నల్లచెరువు వైకాపా నాయకులు దశరథ నాయుడు, లక్ష్మీపతి యాదవ్, కల్లిపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ సమీవుల్లా, బసిరెడ్డి కేశవరెడ్డి, అంజినప్ప, వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి





**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, జులై 17 :** రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కోసం అన్ని విధాలా ఏర్పాట్లు వెంటనే పూర్తి చేసి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్న అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19వతేదీన శనివారం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను తిరుపతి నుంచి వర్చువల్ గా ప్రారంభించడం జరుగుతుందన్నారు. నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కోసం అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

సెంటర్ ను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని, అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని, లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆర్.అండ్.బి జెఈ బాల కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాలలో పోలీసుల పల్లెనిద్రలు

### - గ్రామాల్లోని తాజా సమస్యలపై దృష్టి... పరిష్కారానికి కృషి






**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూలై 17:** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలలి మేరకు పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలు/కాలనీలలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడి తాజా సమస్యలపై ఆరా తీశారు. సమస్యలు తీవ్రం కాకుండా ప్రారంభ దశలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా అందరూ కృషి చేయాలి. అల్లర్లు, గొడవలకు దూరంగా ఉంటూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని... ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలు – సైబర్ మోసాలు గురించి అవగాహన చేశారు. డిజిటల్ అరెస్టు, లోన్ యాప్ ఫ్రాడ్స్, ఏపికె ఫైల్స్ ఫ్రాడ్స్ , తదితర మోసాలు గురించి వివరించారు. డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మకూడదని...అపరిచితుల కాల్స్ మరియు లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కలిగించారు.

## సుపరిపాలన తొలి అడుగులో 17వ వార్డు ఇన్‌ఛార్జి ఎస్ఎం బాషా

**గుత్తి–సూర్య వాస్తవం,జులై 17 :** గుత్తి గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జ యరాం ఆదేశాలు మేరకు తన యుడు గుత్తి పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో గుత్తి పట్టణ అధ్యక్షు డు ఎంకె చౌదరి సహకారంతో గు త్తి పట్టణం 17వ వార్డ్ లో 17వ వార్డు ఇంచార్జ్ మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ ఎం భాష ఆధ్వ ర్యంలో 17వ వార్డు180,181బూ తులలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా డోర్ టు డోర్ తిరిగి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవ్వ తాతల పెన్షన్ 30 00 నుంచి 4000 రూపాయలకు పెంచారు అలాగే సూపర్ సిక్స్ ప థకంలో మహిళాశక్తి లో భాగంగా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అలాగే తల్లి కి వందనంలో భాగంగా ఇంటి లో ఎంతమంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పథకం లబ్ధి పొందిన తల్లి దండ్రులు నారా చంద్రబాబు నాయుడు,నారా లో కేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు అలాగే వారు మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం రాబోయే రోజులలో అనేక పథకాలను ప్రవే శపెడుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గుత్తి పట్టణ 17 వార్డు 180 బూ త్ కన్వీనర్లు రసూల్,అశోక్,181 బూతు కన్వీనర్ జంగాల మద్దిలేటి,17వ వార్డు అధ్యక్షుడు వడ్డే వెంకటేష్,నాగన్న,యాదుళ్ళ టైలర్ సురేష్,జంగాల సుధాకర్, తెలుగుదేశం పార్టీ నాయ కులు కార్యకర్తలు పాల్గొనడం జరి గింది.



# విశాఖలో 'హరి హర వీరమల్లు' ప్రీరిలీజ్ వేడుక




పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ జంటగా నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. ఈ సినిమా తొలి భాగం ఈ నెల 24న విడుదల కానుంది. ప్రీరిలీజ్ వేడుకను ఈ నెల 20న విశాఖపట్నంలో నిర్వహించాలని మేకర్లు నిర్ణయించారు.

ఇటీవలే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్‌ను పొందింది. ఈ సినిమాకి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి సంగీతమందించారు. ఎఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్‌రావు నిర్మించారు. ఈ వేడుకను భారీఎత్తున నిర్వహించటానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

# 'పరదా' ఫస్ట్ సాంగ్ విడుదల



భర్తచనిపోతే ఆ చితిలోనే భార్య చనిపోయే సతీ సహగమనం దురాచారంపై 'పరదా' అనే సినిమా తెరకెక్కుతుంది. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సంగీత, దర్శక రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి లిరికల్ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రామంతే తత్ర దేవతా' అంటూ సాగిన ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టుకుంది. వనమాలి ఈ పాటకి లిరిక్స్ అందించారు. సింగర్ అనురాగ్ కులకర్ణి ఆలపించారు. గోపి సుందర్ సంగీతం అందించారు. ఆగస్టు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# త్రివిక్రమ్ కూడా రాజమౌళిలా ఆలోచిస్తున్నాడా?

**- దర్శక శిఖరం రాజమౌళి సినిమాల్లో హాలీవుడ్ టెక్నాలజీ కనిపిస్తుంది**
**- హాలీవుడ్ రేంజ్ లో యాక్షన్ సన్ని వేశాలు డిజైన్ చేస్తుంటారు**



దర్శక శిఖరం రాజమౌళి సినిమాల్లో హాలీవుడ్ టెక్నాలజీ కనిపిస్తుంది. హాలీవుడ్ రేంజ్ లో యాక్షన్ సన్ని వేశాలు డిజైన్ చేస్తుంటారు. 'బాహుబలి', 'ఆర్ ఆర్ ఆర్' చిత్రాల్లో అది స్పష్టంగా కనిపించింది. హాలీవుడ్ సన్నివేశాల్ని స్ఫూర్తిగా తీసుకున్నా? ఇంకెలా తీసుకున్నా? తన మేకింగ్ తో ఆకట్టుకోవడం రాజమౌళికే చెల్లింది. అందుకే నేడు గ్లోబల్ స్థాయిలో నీరాజనాలు అందుకుంటున్నారు. మరి గురూజీ త్రివిక్రమ్ కూడా ఇప్పుడు రాజమౌళిని అనుసరిస్తున్నారా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో త్రివిక్రమ్ ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. మైథలాజికల్ కాన్సెప్ట్ ఆధా రంగా తెరకెక్కించనున్నారు.

'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ కూడా ప్రచారంలో కి వచ్చింది. భారతీయ పురాణాలలో యుద్ధ దేవుడైన లార్డ్ కార్తికేయ కథ ఆధారంగా స్టోరీ సిద్దం చేసినట్లు వినిపిస్తుంది. ఇటీవలే తారక్ కూడా అదే తరహా పుస్తకం చదువుతున్నట్లు క్లారిటీ వచ్చింది. ఈ ప్రాజెక్ట్‌ను ఓ వీడియో గ్లింప్స్‌తో గ్రాండ్ గా లాంచ్ చేయాలని ప్లాన్ చేసారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత నాగ వంశీ కూడా వెల్లడించారు. కానీ బాలీవుడ్ 'రామాయణం' వీడియో చూసిన తర్వాత గురూజీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. రామయాణంలో హై ఎండ్ విజువల్ ఎఫెక్ట్స్ చూసి సర్ ప్రైజ్ అయ్యారు. తాను కూడా గ్లింప్స్ వదిలితే ఈ రేంజ్ లో ఉండాలి? లేదా అంతకు మంచి ఉండాలని డిసైడ్ అయ్యారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రీ టీజర్ వదలితే బాగుంటుందని భావించి తాత్కాలికంగా రిలీజ్ ఆలోచన విరమించు కున్నారుట. టెక్నాలజీ పరంగానూ త్రివిక్రమ్ ఇంకా అప్ డేట్ కావాలని.. దీనికి సంబంధించి హాలీవుడ్ స్టూడియోలతో చర్చించాలని భావిస్తున్నారుట. హాలీవుడ్ ప్రమాణాలతో త్రివిక్రమ్ పాన్ ఇండియా సినిమా ఉండాలని గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. సాధారణంగా స్టోరీల విషయంలో గురూజీ కూడా హాలీవుడ్ సినిమా స్టోరీల నుంచి ఇన్ స్పైర్ అవుతుంటారు. వాటి స్పూర్తితో తెలుగు నేటివిటీకి తగ్గట్టు వేగంగా స్క్రిప్ట్ సిద్దం చేయ గలరు. తాను నేర్చుకోవడం మొదలు పెడితే ఆ పని చాలా వేగంగా పూర్తి చేయగల దర్శకుడు త్రివిక్రమ్.



# నెట్స్‌లో చెమటోడ్చుతున్న ఆటగాళ్లు

**- బెకెన్‌హామ్‌లో టీమిండియా ప్రాక్టీస్ - 23నుంచి ఇంగ్లండ్‌తో నాల్గో టెస్ట్**



**మాంచెస్టర్:** ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టు కోసం టీమిండియా ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. ఈ మ్యాచ్ కోసం భారత జట్టు బెకెన్‌హామ్‌లో తమ ప్రాక్టీస్‌ను మొదలు పెట్టింది. గురువారం తొలి ప్రాక్టీస్ సెషన్‌లో గిల్ సేన తీవ్రంగా శ్రమించింది. అయితే ఈ ప్రాక్టీస్ సెషన్‌కు టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ దూరమయ్యాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో పంత్ చేతి వేలికి తీవ్ర గాయమైంది. దీంతో అతడి స్థానంలో ధృవ్ జురెల్ సబ్‌స్ట్యూట్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. కానీ బ్యాటింగ్‌కు పంత్ దిగాల్సి వచ్చింది. అతడు రెండు ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు మాత్రం వచ్చాడు. తీవ్రమైన నొప్పితో బాధపడుతూనే బ్యాటింగ్ చేశాడు. ఈ క్రమంలో నాలుగో టెస్టుకు పంత్ అందుబాటులో ఉండడం కష్టమే. తాజాగా పంత్ గాయంపై భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్‌డెష్కాట్ అప్‌డేట్ ఇచ్చాడు. పంత్ ఇంకా నొప్పితో బాధపడు తున్నాడని, మాంచెస్టర్ టెస్ట్ నాటిక ఫిట్‌నెస్ సాధించడం కష్టమేనని తెలిపాడు. పంత్ చేతి వేలి నొప్పి కాస్త తగ్గిందని, కానీ ముందుస్తు జాగ్రత్తగా ప్రస్తుతం అతడు ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడని తెలిపాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే పంత్‌నే బ్యాటింగ్, వికెట్ కీపింగ్ రెండూ చేస్తాడు. రాబోయే రోజుల్లో అతడి ఫిట్‌నెస్‌పై కచ్చితంగా అప్‌డేట్ ఇస్తామని డెష్కాట్ పేర్కొన్నాడు.

**అర్ష్‌దీప్‌కు గాయం.:** నాల్గో టెస్ట్‌కు ముందు భారత జట్టుకు ఎదురు దెబ్బ తగిలింది. నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ చేతి వేలికి గాయమైంది. బంతి చేతి వేలికి తాకడంతో తీవ్ర గాయమైంది. దీంతో అతడి చేతి వేలికి ఫిజియో టేప్ వేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్‌డెష్కాట్ కూడా ధ్రువీకరించారు. కాగా వన్డే, టి20ల్లో అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్.. టెస్టుల్లో మాత్రం ఇంకా భారత్ తరపున ఆడలేదు. ఇంగ్లండ్ టూర్‌కు ఎంపికైనప్పటికి తొలి మూడు టెస్టులకు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఒకవేళ నాలుగో టెస్టుకు జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇస్తే.. అర్ష్‌దీప్‌కు తుది జట్టులోకి చోటు దక్కే అవకాశముందని భావించినా.. ఇంతలోనే గాయపడడం జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది.

**కుల్దీప్‌కు చోటు:** నాల్గో టెస్ట్‌కు రెగ్యులర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు చోటు దక్కే ఛాన్స్ ఉంది. తొలి మూడు టెస్టుల్లో స్పిన్నర్లు పెద్దగా ప్రభావం చూపకున్నా.. మాంచెస్టర్ మైదానం స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. దీంతో సుందర్, నితీశ్ రెడ్డిల స్థానంలో అతడికి తుది జట్టులో చోటు లభించ వచ్చు. మరోవైపు ఇంగ్లండ్ జట్టుకూ గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మూడోటెస్ట్‌లో గాయపడ్డ రెగ్యులర్ స్పిన్నర్ బషీర్ నాల్గో టెస్ట్‌కు దూరమయ్యాడు. మూడో టెస్ట్ గెలుపులో కీలకపాత్ర పోషించిన బషీర్.. వేలి గాయంతోనే బౌలింగ్ చేసిన సంగతి తెలిసిందే. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారతజట్టు 1-2తో వెనుకబడి ఉండగా.. జులై 23నుంచి మాంచెస్టర్ వేదికగా నాల్గో టెస్ట్ జరగనుంది.

# ఇంగ్లాండ్‌పై భారత్ విజయం



**సౌథాంప్టన్:** ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి మహిళా వన్డేలో భారత్ నాలుగు వికెట్ల తేడాతో సునాయాసంగా విజయం సాధించింది. దీప్తి శర్మ అర్ధ సెంచరీతో రాణించింది. దీప్తి 64 బంతుల్లో మూడు బౌండరీలు, ఒక సిక్సర్‌తో అజేయంగా 62 పరుగులు చేయడంతో 10 బంతులు మిగిలి ఉండగానే భారత్ 259 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో ప్రపంచ కప్ కోసం డ్రెస్ రిహార్సల్స్ ఉత్సాహంగా సాగింది. జెమిమా రోడ్రిగ్స్ (54 బంతుల్లో 48)తో కలిసి 14.2 ఓవర్లలో ఆమె ఐదవ వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం మ్యాచ్ విన్నింగ్‌గా నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17) వికెట్ కోల్పోయిన భారత్ ఆల్ రౌండర్ అమంజోత్ కౌర్ (14 బంతుల్లో 20) వికెట్ ను కోల్పోయింది. దీంతో 124 పరుగులకే 4 వికెట్లు పడి కష్టాల్లో ఉన్న జట్టును దీప్తి, రోడ్రిగ్స్ భాగస్వామ్యం భారత్ ను విజయం వైపుగా నడిపించింది. భారత మహిళల జట్టు వన్డే సిరీస్‌లోనూ సమిష్టిగా రాణించింది. బౌలర్లు క్రాంతి గౌడ్, స్నేహ్ రాణాకు తోడు తెలుగమ్మాయి శ్రీ చరణి, అమన్‌జ్యోత్ కౌర్ కూడా రాణించడంతో ఇంగ్లండ్‌ను కేవలం 258పరుగులకే పరిమితం చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్ మహిళలతో రోస్ బౌల్ వేదికగా బుధవారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్‌కు రెండేసి, శ్రీ చరణి, అమన్‌జ్యోత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

# అంతర్జాతీయ క్రికెట్‌కు ఆండీ రస్సెల్ గుడ్‌బై



**జమైకా:** వెస్టిండిస్ టి20 స్పెషలిస్ట్ ఆండ్రీ రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఎంపికైన 37 ఏళ్ల రస్సెల్ జమైకాలోని సబీనా పార్క్‌లోని హౌంగ్రౌండ్‌లో జరిగే తొలి రెండు మ్యాచులు ఆడి ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకనున్నట్లు తెలిపాడు. విండీస్ క్రికెట్ బోర్డు రస్సెల్ రిటైర్మెంట్‌ను ధృవీకరిస్తూ పోస్ట్ చేసింది. 'వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో గర్వించదగ్గ విజయాలలో ఒకటి. నేను చిన్నప్పుడు ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. కానీ, మీరు క్రీడను ఎంత ఎక్కువగా ఆడటం, ప్రేమించడం ప్రారంభిస్తే మీరు ఏమి సాధించగలరో మీరు గ్రహిస్తారు. ఇది నన్ను మెరుగ్గా మారడానికి ప్రేరేపించింది. ఎందుకంటే నేను మెరూన్ రంగులో ఒక ముద్ర వేయాలని, ఇతరులకు ప్రేరణగా మారాలని కోరుకున్నాను' అని రస్సెల్ పేర్కొన్నాడు. రస్సెల్ 2019 నుంచి టి20 స్పెషలిస్ట్ ప్లేయర్‌గా రాణిస్తున్న రస్సెల్.. వెస్టిండిస్ తరఫున 84 టి20 మ్యాచుల్లో 22.00సగటు, 163.08 స్ట్రైక్ రేట్‌తో 1,078 పరుగులు చేశాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యుత్తమ స్కోరు 71 పరుగులు. 30.59 సగటుతో 61 వికెట్లు తీసుకోగా.. అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 3/19. విండీస్ తరఫున ఒకే ఒక్క టెస్టు మాత్రమే ఆడాడు. 56 వన్డేల్లో 27.21 సగటుతో 1,034 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు అర్ధ సెంచరీలు ఉండగా.. అత్యధిక స్కోర్ 92. వన్డేల్లో 31.84 సగటుతో 70 వికెట్లు పడగొట్టాడు. అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 4/35. రస్సెల్ 2012, 2016లో ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లను గెలుచుకున్న వెస్టిండీస్ జట్టు సభ్యుల్లో ఒకడు. ఆయా దేశాల్లో జరిగే లీగ్‌లలో మాత్రం ప్రాతినిధ్యం వహిస్తానని తెలిపాడు.

# మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోవర్ధన్ నాయుడుకు ఘన సన్మానం



**పత్తికొండ టౌన్ –సూర్య వాస్తవం జూలై 17:** ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు సాలరంగడు మాట్లాడుతూ...మనతోపాటు విలేకరుగా ప్రయాణం చేస్తూ కూటమి ప్రభుత్వంలో బిజెపి పార్టీ పతికొండ నియోజకవర్గం కో-కన్వీనర్గా పనిచేస్తున్న గోవర్ధన్ నాయుడు కూటమి ప్రభుత్వంలో పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్గా ప్రమాణం స్వీకరణం చేసిన సందర్భంగా మనం కూడా విలేకరి వృత్తిలో పనిచేసి ప్రజాపాలనలో భాగంగా అడగు పెట్టిన సందర్భంగా గురువారం నాడు స్థానిక రీడింగ్ రూమ్ ఆవరణలో గోవర్ధన్ నాయుడును సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ ఏడు మాట్లాడుతూ, గతంలో పత్రికా విలేకరిగా పనిచేసినందుకు నన్ను గుర్తించి ఈ కూటమి ప్రభుత్వం బిజెపి తరఫున మన మార్కేడిఆర్ డైరెక్టర్ గా నన్ను చేసినందుకు మన మిత్రులను అందరి తరఫున విలేకరులందరికో ధన్యవాదాలు తెలుపుతున్నాను. అలాగే నాకు అవకాశం ఇచ్చినటువంటి ప్రజలకు రైతులకు నా వంతు కృషి చేస్తానని అందరి తరపున వాగ్దానం చేస్తున్నానను. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే గౌరవ అధ్యక్షులు రంగన్న, నాగరాజు, కనిగిరి మధు, గిడ్డయ్య, మధుబాబు, మల్లీ, రాజశేఖర్, షఫీ, శిక్షావలి, జాఫర్, రాజు, లచ్చి,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న అగర్వాల్ కంపెనీ వాహనం..



**పెళ్లకూరు– సూర్యా వాస్తవం, జూలై 17:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం .పెన్నేపల్లి గ్రామంలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ కంపెనీకి వస్తున్న లారీలు అతివేగంగా వెళుతుండడంతో కానూరు, పెన్నేపల్లి గ్రామాల ప్రజలు ప్రాణాలు పిడికిట్టులో పెట్టుకొని ఉన్నామని వాపోతున్నారు. బుధవారం రోజున ఐరన్ లోడ్ తో వెళ్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. ఆ మార్గంలో ప్రయాణించే గ్రామాల ప్రజలు వాహనదారులు రోడ్డు మీద వెళ్లాలంటే భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ఆ కంపెనీకి పాత ఐరన్ లోడుతో వెళ్తున్న లారీలో నుంచి చీలలు రాళ్లడంతో వాహనాల టైర్లకు గుచ్చుకొని పంచర్ కావడంతో సమయానికి గమ్యాన్ని చెరలేక లేక తీవ్ర ఇబ్బంది గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, కంపెనీ యాజమాన్యం స్పందించి చొరవ తీసుకోవాలని వాపోతున్నారు.

# వెంకటగిరి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు



**పెళ్లకూరు, సూర్యా వాస్తవం జూలై 17:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం రావులపాడు గ్రామానికి చెందిన టిడిపి సూళ్లూరుపేట నియోజకవర్గం రైతు విభాగ ఉపాధ్యక్షుడు కె.వి నాయుడు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పుట్టిన రోజు వేడుకలు పాల్గొన్నారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకలియుగ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె.వి నాయుడు, కొత్త చెరువు రమేష్ రెడ్డి, పాల్గొన్నారు.

# ముస్లిం ధార్మిక సామాజికవేత్త అబ్దుల్ వహాబ్‌ను పరామర్శించిన షరీఫ్, అజీజ్



**కదిరి – సూర్య వాస్తవం, జూలై 17:**సామాజిక, ఆర్థిక, నైతిక రంగాలలో కూడా మార్గదర్శకత్వ ప్రముఖ ధార్మిక ఇమాం అనారోగ్య కారణంగా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న జామియా నూరుల్ హుదా అరబిక్ కాలేజ్ వ్యవస్థాపకులు ముఫ్తీ షేక్ అబ్దుల్ వహాబ్ ను మూలపేటలోని జామియా నూరుల్ హుదా అరబిక్ కాలేజ్ లో మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ అహ్మద్ షరీఫ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట టిడిపి సీనియర్ నాయకులు నన్నే సాహెబ్ ఉన్నారు. ముఫ్తీ అబ్దుల్ వహాబ్ దేశవ్యాప్తంగా ముస్లిం సమాజంలో ఆయనకంటూ ఒక స్థానం ఏర్పరచుకున్నారు. సమాజానికి ఆయన ఎంతో సేవ చేశారు.

# వైయస్ జగన్‌తోనే నా రాజకీయ పయనం

**- మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్**



**హిందూపురం –సూర్య వాస్తవం, జూలై 17:** వైకాపా అధిష్టానం తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే తన రాజకీయ పయనం కొనసాగుతుందని ఆ పార్టీ నుండి సస్పెండ్ కు గురైన మాజీ ఆగ్రోస్ చైర్మన్ బి. నవీన్ నిశ్చల్ పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆయన్ను సస్పెండ్ చేసిన నేపథ్యంలో గురువారం తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కొంత మంది ఉద్దేశపూర్వకంగా తనపై కక్ష కట్టి రాజకీయ కుట్రలో భాగంగానే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేయించారని పేర్కొన్నారు. తనపై వైసీపీ అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు చేశారని, దానిపై అధిష్టానం పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉంటే బాగుండేదన్నారు. తాను వైసిపి లో క్రియా శీలకంగా దీంతో తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ టికెట్ తనకు దక్కుతుందనే ఉద్దేశం తో ఇప్పటి నుంచే నా పై కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. హిందూపురం నియోజక వర్గంలో ఎవరి బలం ఎంతో ప్రజలందరికీ బాగా తెలుసునని నవీన్ పేర్కొన్నారు.గత ఎన్నికల ముందు నుంచే నా పై రాజకీయ కుట్రలు మొదలు అయ్యాయని, గత ఎన్నికల ముందు కొన్ని దుష్ట శక్తులు పార్టీలో చేరాయని, దానివల్ల పార్టీ పరిస్థితి దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి అధిష్టానం తనను సస్పెండ్ చేసినా నష్టం లేదని, తనను సస్పెండ్ చేయడం వల్ల పార్టీకి లాభమో.. నష్టమో త్వరలోనే పార్టీ అధిష్టానానికి తెలుస్తు ందన్నారు. తాను ఎక్కడా జగన్ మోహన్ రెడ్డికి, పార్టీ కి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడ లేదని, నా రాజకీయ ప్రయాణం జగన్మోహన్ రెడ్డి తోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత 2013 నుంచి హిందూపురం నియోజక వర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనీ బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేశానని తెలిపారు.

అదేవిధంగా 2014- 2019 మధ్య టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కూడా వైసీపీ క్యాడర్ ను కాపాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచారని తెలి యజేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్టీఆర్ తనయుడు బాలకృష్ణ టిడిపి ఎమ్మెల్యేగా ఉన్నా వైసీపీని బలంగా నియోజక వర్గంలో నిలబెట్టినట్లు తెలిపారు. దీనికి తోడు 2019, 2024 ఎన్నికల్లో వైసీపీ టికెట్ ఇవ్వకపోయినా జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేశానని, ఇందులో ఎలాంటి సందేహాలు లేవన్నారు. గత 2024 ఎన్నికల్లో పోటీ చేసిన వాళ్లు ఎంతకాలం వైసీపీలో ఉంటారో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. వరుసగా రెండు ఎన్నికల్లో టికెట్ ఇవ్వక పోయినా జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో పార్టీ కోసం పనిచేశానని నవీన్ చెప్పారు. అయితే కొంత మంది తప్పుడు మాటలు విని తనను పార్టీ నుండి సస్పెండ్ చేశారని, జగన్ మోహన్ రెడ్డి విలువలు, విశ్వసనియతతో రాజకీయాలు చేయాలని చెబుతారని, అందుకు అనుగుణంగానే తాను ఎన్ని ఇబ్బందులు వచ్చినా విశ్వసనీయత, విలువలతో రాజకీయాలు చేశా నన్నారు. కొంతమంది నాయకుల వైఖరి వల్ల నియోజకవర్గం లో వైకాపా పార్టీలు నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నన్ను నమ్ముకున్న క్యాడర్ కోసం ఎవరితోనైనా ఎంత ఎంతవరకైనా పోరాడు తానన్నారు. మా కార్యకర్తలు,అభిమానులు రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకొమన్నా దానికి సిద్ధంగా ఉంటానని నవీన్ స్పష్టం చేశారు.

# గ్రామ పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు

**- రూ. 1 కోటి.లతో మేనకూరు నుండి భీమవరం గ్రామానికి రోడ్ ఏర్పాటుకి కృషి**

**- మాజీ ఎంపీ - స్మశాన అభివృద్ధికి 50 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే**

**- భీమవరం పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని కోరిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోను బాబు**



**నాయుడుపేట –సూర్య వాస్తవం, జులై 17:** తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం భీమవరం గ్రామ పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోను బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ. సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరిని టిడిపి నాయకులు గోను బాబు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోలు బాబు గ్రామపంచాయతీకి కావలసిన సదుపాయాలను వారి దృష్టికి తీసుకువెళ్లారు.అనంతరం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... భీమవరం గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎల్లవేళలా ఎమ్మెల్యే సహకరిస్తాదని ఆయన తెలిపారు అదే విధంగా మేనకూరు నుండి భీమవరం వరకు కోటి రూపాయలతో రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు అదేవిధంగా భీమవరం హరిజనవాడ నుండి స్మశానం వరకు సిసి రోడ్డు ఏర్పాటు చేసి స్మశానానికి కావలసిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని అందుకు ఎమ్మెల్యే 50 లక్షల రూపాయలు నిధులు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ గ్రామం నా సొంత గ్రామం అయిన నా భార్య ఈ గ్రామపంచాయతీ సర్పంచ్ కావడంతో ఆమె అడిగిన కోరికలన్నీ ఈ గ్రామ అభివృద్ధికి ఖచ్చితంగా ఎమ్మెల్యే నిర్వహిస్తాదని ఈ గ్రామంలో ఎలాంటి పార్టీలకు తావు లేకుండా అందరినీ కలుపుకుపోయి అందరితో సమానంగా చూస్తామని ఆయన తెలిపారు 1981 లో భీమవరం గ్రామంలో సర్పంచిగా పోటీ చేసినప్పటి నుండి ఇప్పటివరకు భీమవరం గ్రామ ప్రజలందరికీ సన్నిహితంగా ఉంటున్నామని మా కుటుంబాన్ని అందరూ పార్టీలకు అతీతంగా అభిమానిస్తున్నారని ఇదే అభిమానాన్ని నా కుమార్తె నెలవల విజయశ్రీ కి అన్ని ఎన్నికలలో విజయం సాధించే విధంగా సహకరించాలని ఆయన ప్రజలలో కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరకాలం గడిచిన సందర్భంగా సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ లో భాగంగా వితంతువులకి మూడు వేలు ఉన్న పింఛన్లు 4000 వికలాంగులకు 3000 రూపాయలు నుండి 6000 రూపాయలు చేయడం అలాగే కిడ్నీ వ్యాధిగ్రస్తులకి పాచికంగా పక్షపాతంలో బాధపడుతున్న వారికి పదివేల రూపాయలు, పూర్తిగా మంచం మీద నుంచి లేవలేని వారికి 15 వేల రూపాయలు అందిస్తున్నాముఅన్నారు.గత ప్రభుత్వంలో పేదవారిని కడుపు నింపే అన్న క్యాంటీన్లు మూసి వేయడం జరిగింది కానీ మన కూటమి ప్రభుత్వం అధికారులు వచ్చాక రాష్ట్రంలో 204 అన్నా క్యాంటీన్లు ప్రారంభించి పేదవారి కడుపు నింపుతుంది.మెగా డీఎస్సీ ద్వారా 16400 పోస్టులు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల ప్రెసిడెంట్ సన్న రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, భీమవరం ఉపసర్పంచ్ గోను బాబు, ఆయకట్టు ప్రెసిడెంట్ పోతిరెడ్డి రమణారెడ్డి, పంచేటీ పెంచలయ్య, ఎక్స్ ఎంపీపీ కన్నెమ్మ, ఆయకట్టు ఉపసర్పంచ్ పెదమళ్ళ సురేష్ రెడ్డి, భీమవరం గ్రామ పంచాయతీ సెక్రటరీ గోపాల్, అగ్రి కల్చరల్ అసిస్టెంట్ వంశీ కృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ రాజేంద్ర, హెల్త్ సెక్రెటరీ వీనిలా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేంద్ర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వాసవి మాతకు ఆర్యవైశ్య మహిళల ప్రత్యేక పూజలు



**ప్యాపిలి – సూర్య వాస్తవం,జులై 17 :** ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాలలో గల వాసవి మాతకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీకృష్ణ ఆధ్వర్యం లో ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 21వ రోజు పూజలో భాగంగా రోజా ,లిల్లీ పూలతో అమ్మవారిని అలంకరించి లక్ష జాజిపూలతో సహస్రార్చన చేశారు. అమ్మవారి శాలలో అమ్మవారి ప్రత్యేక పూజలకు మహిళలకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయించిన అధ్యక్షులు రాజా మురళీకృష్ణకు ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక అభిన ందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సుపరిపాలన టీడీపీతోనే సాధ్యం

**- వార్డ్ మెంబర్ వెంకటేష్**



**ప్యాపిలి – సూర్య వాస్తవం,జులై 17 :**సుపరిపాలన టిడిపితోనే సాధ్యమని వార్డు మెంబర్ వెంకటేష్ అన్నారు. గురువారం ప్యాపిలి పట్టణంలోని ఏడవ వార్డులో 31వ బూత్‌లో డోన్ నియోజకవర్గ శాసన సభ్యులు కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు వార్డ్ మెంబర్ వెంకటేష్ ఆధ్వర్యంలో బూత్ ఇంచార్జ్ కాయల మనోహర్, గండికోట రమేష్, దాస్, చంద్రశేఖర్ గౌడ్‌లు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ వెంకటేష్‌తో పాటు వీరంతా కలిసి 31వ బూత్‌లో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు అంది ంచారు. అనంతరం అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే అధికారుల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )